నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
1
శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

బాధితులకు బాసటగా 'భరోసా' : సీపీ అంబర్‌కిషోర్ ఝా



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

లైంగిక దాడులకు గురైన బాధితులను అక్కున చేర్చుకోని వారికి భరోసా కేంద్రం అండగా నిలుస్తుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో నమోదైన లైంగిక దాడుల కేసుల్లో బాధితులు వైద్య, వసతి, ఆర్థిక, న్యాయపరంగా సహకారం అందిస్తున్న భరోసా కేంద్రంలో ఈ కేసుల్లోని నిందితులకు శిక్షలు పడేలా భరోసా కేంద్రం అధికారులు, సిబ్బంది పనితీరును అభినందిస్తూ తెలంగాణ మహిళా భద్రత విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు షికా గోయల్ జారీ చేసిన ప్రశంసాపత్రాలను కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా అధికారులు, సిబ్బంది అందుకున్నారు. భరోసా కేంద్రం అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు. ఈ కేంద్రం సిబ్బంది ఇప్పటి వరకు 24కేసుల్లో బాధితులకు బాసటగా నిలవడంతో పాటు నిందితులకు కోర్టు శిక్షలు విధించడంలో కీలకంగా నిలిచారు. అలాగే 335మంది బాధితులకు మొత్తం కలిపి రూ.1.20 కోట్లను పరిహారం కింద అంద చేయడంతో పాటు మరో 8మందికి మొత్తం రూ.14.16లక్షల పరహారాన్ని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ అందచేశారని తెలిపారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో ఇన్స్‌పెక్టర్ సువర్ణ, ఎస్సై శ్రావణి, సిబ్బంది నీరజ, నవ్య, సాగరిక, సుమలత, రజిత, పవిత్ర, మౌనిక తదితరులున్నారు.



రికార్డుల ప్రకారం నాలా సర్వే నిర్వహించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్

రెవెన్యూ రికార్డుల ప్రకారం నాలా సర్వే నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం నయీంనగర్ నాలాను కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి కొనసాగుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు.అనంతరం కమీషనర్ మాట్లాడుతూ నాలాకు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి ఉన్నందున 3-4 రోజుల్లో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు ప్రెసిడెన్సీ స్కూల్ నుంచి డబ్బాల బ్రిడ్జి వరకు రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే పూర్తయిన తర్వాత రిటైనింగ్ వాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి నాలా హద్దులకు చెందిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసుల గురించి టౌన్ ప్లానింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న, ఆర్డీఓ సిదాందత్తు, డీసీపీ ప్రకాష్‌రెడ్డి, బల్దియా ఈఈ రాజయ్య, ఇరిగేషన్ ఈఈ అంజనేయులు, ఇరిగేషన్ డీఈఈ హర్షవర్ధన్, హన్మకొండ తహశీల్దార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాక సమావేశం

దామెరలో జరిగే సభను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ మండల యూత్ నాయకులు సిరిసి శ్రీకాంత్

నవతెలంగాణ గీసుకొండ



అమలు కానీ హామీలు ఇస్తా మంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపించి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు సిరిసే శ్రీకాంత్ అన్నారు. దామర మండలంలో జరిగే నేడు (శనివారం) ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమా వేశానికి అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సాధ్యంగానే హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన యువతను కోరారు. ఈ కార్యక్రమంలో చల్లారాజు, విజయ్, అఖిల్, ఆనంద్ పాల్గొన్నారు.

'ఆర్‌డీఎఫ్'లో అర్చరీ వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కల్లెడ ఆర్‌డి ఎఫ్‌లో ఆర్చరీ అకాడమీ ఆధ్వ ర్యంలో ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 20 నుండి జూన్ 5 వరకు కొనసాగుతుందని ఆర్చరీ కోచ్ రేణు మండల్ శుక్రవారం తెలిపారు.ఈ శిక్షణలో భాగంగా షవుటింగ్, బాడీ పోస్చర్, ఫిజికల్ ఆక్టివిటీ, ఇతర విషయాల గురించి అవగాహనా కల్పించటం కోసం ఈ వేసవి శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న బాల, బాలికలకు ప్రత్యేక హస్టల్ వసతి కలిపించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.జనార్ధన్ తెలి పారు. మండలంలోని విద్యా ర్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9959301913, 9989030018 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

అకాల వర్షాలతో.. అన్నదాత అరిగోస



కల్లాల్లో తడిసిన ధాన్యం..రైతుల దైన్యం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కల్లాల్లో, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వరదకు కొట్టుకుపోతున్న పరిస్థితి వుంది. ఈదురుగాలులు, భారీ వర్షంతో రహదారులపై, కల్లాల్లో వున్న ధాన్యం కొట్టుకుపోయి మట్టిపాలయింది. ఎన్నో రోజులుగా రైతులు కేంద్రాల్లో ధాన్యం కాంటాల కోసం ఆరబోసుకొని వేచి చూశారు. కాంటాల్లో జాప్యంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మూడు, నాలుగురోజుల పాటు భారీ వర్షాలున్నాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతుంది. వరంగల్, హన్మకొండ, ములుగు, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. హన్మకొండ జిల్లాలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సుమారు 600 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించాల్సి వుంది. అకాల వర్షంతో ఈ ధాన్యం కేంద్రాల్లోనే తడిసిపోయింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత రెండ్రోజులుగా అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాకుండా ఆగిపోయిన ధాన్యం కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తడిసిన ధాన్యాన్ని ఎండపెట్టడానికి రైతులు తీవ్ర వ్యయప్రయాసాలకు గురవుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. త్వరితగతిన కొనుగోలు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, లేనిపక్షంలో కేంద్రాల్లోనే అకాల వర్షాలకు తడిసిపోయి, కొట్టుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముంది. జనగామ జిల్లాలో సివిల్ సప్లయిస్ అధికారి తరుచు కొనుగోలు కేంద్రాలను అప్రమత్తం చేస్తూ క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందికి తగు చర్యలకు ఆదేశాలు జారీ చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచారు. అన్ని జిల్లాలో అధికారులు అదేస్థాయిలో క్షేత్రస్థాయిలో కేంద్రాలను సందర్శిస్తూ అధికారులను పురమాయిస్తే ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరిగి వర్షాలకు నష్టాలు తగ్గే వన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అధికారుల ఉదాసీనత, కొనుగోళ్లలో జాప్యం రైతులకు శాపంగా మారింది.

మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. మహబూబాబాద్ జిల్లాలో సగటున 7సెంటిమీటర్లు కురియగా, ములుగు జిల్లాలో సగటున 2.1 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో సగటున 7సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మహబూ బాబాద్‌లో 11.8 సెంటిమీటర్లు, కురవిలో 11.6, నెల్లికుదురులో 10.4, గార్లలో 10.4, నర్సింహులపేటలో 9.9, బయ్యారంలో 9.1, మరిపెడలో 9.3, దంతాలపల్లిలో 8.1, డోర్నకల్‌లో 7.0, తొర్రూరులో 6.2, పెద్దవంగరలో 4.2, కేసముద్రంలో 3.9, గూడూరులో 2.6, గంగారంలో 1.7 సెంటిమీటర్ల వర్షపాతం కురిసింది. ములుగు జిల్లాలో సగటున 2.1 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మంగపేటలో 2.6సెంటిమీటర్లు, వెంకటాపూర్‌లో 2.2 సెంటిమీటర్లు, ములుగులో 4.8, గోవిందరావుపేటలో 2.1, తాడ్వాయిలో 1.9, ఏటూర్ నాగారంలో 1.3, కన్నాయి గూడెంలో 1.3, వెంకటా పురంలో 1.8 సెంటిమీటర్ల వర్షపాతం నమోదయింది.

తడిసిన ధాన్యంతో రైతుల్లో ఆందోళన

వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. జనగామ జిల్లాలో ధాన్యం కొనుగోలు దాదాపు పూర్తికాగా, మిగిలిన జిల్లాల్లో చివరి దశకు చేరుకుంది. గత రెండ్రోజులుగా వర్షాలు కురియడం రైతులకు తీవ్ర నష్టదాయకంగా పరిణమించింది.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు గడువులోగా పూర్తి చేయాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో

నవతెలంగాణ-వరంగల్



సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తో ఆ శాఖ కమిషనర్, టీఎస్ఎంఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌వి కర్ణన్, జాయింట్ కమిషనర్ వినయ్‌కష్టారెడ్డి, కలెక్టర్ పి. ప్రావీణ్యతో కలిసి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల ప్రగతిని అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నగరంలోని ఎంజీఎం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ సీకేఎం ప్రసూతి ఆసుపత్రి, హన్మకొండ ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ టీబీ ఆసుపత్రులలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న విభాగాలు, ఉపస్థితిలో ఉన్న ఈక్విప్మెంట్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుప త్రిలోకి మార్పు చేసే విభాగాలు తదితర అంశాలను ఆయా ఆసుపత్రుల పర్యవేక్షకులతో కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా క్రిస్టియానా జెడ్ చొంగ్తో అధికారులతో కలిసి కొనసాగుతున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంజీఎం ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, పిడియాట్రిక్ విభాగాలను, కేఎంసీలోని పీఎంఎస్ఎస్‌వై ఆసుపత్రి క్యాథ్ ల్యాబ్, డయాలిసిస్ విభాగాలను సందర్శించి ఎక్విప్మెంట్, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేంద్ర, ఈఈ జితేందర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఎస్ఈ దేవేందర్, ఎంజీఎం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ సికేఎం ప్రసూతి ఆసుపత్రి, టిబి ఆసు పత్రుల పర్యవేక్ష కులు చంద్రశేఖర్, నిర్మల, విజయలక్ష్మి, శ్రవణ్, గిరిధర్, సికేఎం ప్రిన్సిపల్ మోహన్ దాస్, వైస్ ప్రిన్సిపల్ రాం కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపించాలి : ఎంపీపీ

నవతెలంగాణ-ఖానాపురం

మండలలోని పట్టభద్రులు, మేధా వులు, ఉద్యోగ ఉపాధ్యాయులు తమ ఓటును ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ తరపున బరిలో నిలబడుతున్న ఏనుగుల రాకేష్‌రెడ్డికి వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు అన్నారు. ఈ సందర్భంగా వారు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట రామ నరసయ్య ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ మండల ఇన్చార్జి ఎస్‌కె మస్తాన్‌లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని, మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్ట్ర నలుమూలల అభివద్ధి చేశారని అన్నారు. మే 22న నర్సంపేట మున్సిపాలిటీలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం 5గంటలకు నిర్వహించనున్న పట్టభద్రుల ఓటర్ల సమావేశానికి పార్టీ ప్రతినిధులు, పట్టభద్రుల ఎన్నికల ఓటర్లు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రవీణ్ కుమార్, రమేష్, రాదారపు అశోక్, పోతారాజు దేవేందర్, వెన్ను పూర్ణచందర్, బోడ దేవేందర్, వడ్డే రాజశేఖర్, బంధా రపు శ్రీనివాస్,మాజీ సర్పంచ్ సుమన్, ధారావత్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక.. మలేరియా సిబ్బంది వెతలు

ఐదు నెలల నుంచి అందని వైనం
అర్థాకలితో బతుకీడుస్తున్న కార్మికులు
సక్రమంగా అందించాలని వేడ్కోలు

నవతెలంగాణ-వరంగల్ గ్రేటర్



వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మలేరియా విభాగంలో పని చేస్తున్న 90మంది మలేరియా సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు సక్రమంగా అందకగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కార్మికులు మహానగరంలో దోమల నివారణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధి 66డివిజన్లలో దోమల నియంత్రణకు దోమల మందు పిచికారి చేయడంతో పాటు సుమారు 7గంటల ప్రాంతంలో వీధులలో తిరుగుతూ దోమల నియంత్రణకు పొగ కొట్టుతూ ప్రజలను దోమల బారి నుండి కాపాడుతున్నారు. అయితే ఇంత కష్టపడుతున్నా వీరికి మాత్రం సరైన సమయంలో వేతనాలు అందక అర్థాకలితో అలమటిస్తున్నామని మలేరియా సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నగర ప్రజలను దోమలబారిన పడకుండా నిర్విరామంగా కష్టపడుతున్నా సరైన వేతనం లేక, పిల్లలను చదివించుకోలేక అధిక వడ్డీలకు ప్రయివేటు అప్పులు చేస్తూ మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చాలా ఏండ్లుగా చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నటికీ ఈఎస్ఐ, పీఎఫ్ లేకపోవడంతో ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే కనీసం ప్రయివేటు వైద్యం చేయించుకోవడానికి చిల్లిగవ్వలేక అప్పులు చేస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకుంటున్నామని వారు మనోవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత కష్టపడి పని చేస్తుంటే సంబంధిత అధికారులు మాత్రం వేతనాలు ఇచ్చే క్రమంలో నెలలకు నెలలుగా వేతనాలు ఇవ్వడంలో ఆలస్యం చేస్తే బతకడం ఎట్లా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని క్రమంగా తప్పకుండా ప్రతినెలా మొదటి వారంలో వేతనాలు అందేలాగా చూడాలని కోరుతున్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ కార్డులు అందించాలి : నద్దునూరి రాజేష్‌కన్నా (కార్మిక నాయకుడు)



వరంగల్ మున్సిపల్ కార్పొ రేషన్‌లోని మలేరియా విభాగంలో మేము చాలా ఏండ్ల నుంచి 90మందిమి పని చేస్తున్నాం. ప్రతినెలా ఇచ్చే వేతనం సక్రమంగా అందించాలి. తమకు ఈఎస్ఐపీఎఫ్ కార్డులు అందించాలి. ఏదైనా అనారోగ్యం తలెత్తితే చేసిన జీతం వైద్యానికే సరిపోవడంలేదు. ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు ఇచ్చి ఈఎస్ఐ, పీఎఫ్ కార్డులు అందజేయాలి.

వేతనాలు సక్రమంగా అందించాలి : సింగారం బాబు(సీఐటీయూ నాయకులు)



కార్మికలకు వేతనాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దు. నెలనెలా వేతనాలు సక్రమంగా ఇవ్వాలి. కళాశాలు, పాఠ శాలలు ప్రారంభమవు తున్నాయని, కార్మికులకు వేతనాలు సరైన సమయంలో వేతనాలు ఇస్తే ఇబ్బందులు ఉండవు. ఇప్పటినుంచైనా వేతనాలు సక్రమంగా అందించి కార్మికులను ఆదుకోవాలి.

బాధితుడికి ఆర్థికసాయం

నవతెలంగాణ-గీసుకొండ



మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన మండ లక్ష్మీనారాయణ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు.ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుల అల్లం బాలకిషోర్‌రెడ్డి లక్ష్మీనారాయణ కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ మండల నాయకులు అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చాపర్తి కనకయ్య, గాడుదుల బోన్దాలు, మర్రి కోటిలింగం తోట కమలాకర్, ఎంబాడి మహేందర్, పేర్ల రాజకుమార్, పేర్ల రవి, పేర్ల ఐలయ్య, పేర్ల సాంబయ్య, సాంబయ్య మండ చంద్రమౌళి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
హనుమకొండ
శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

రెవెన్యూ రికార్డుల ప్రకారం నాలా సర్వే నిర్వహించండి : జీడబ్ల్యుఎంసీ కమిషనర్

- క్షేత్రస్థాయిలో నయీమ్ నగర్ నాలా పరిశీలన



నవతెలంగాణ-నయీంనగర్

రెవెన్యూ రికార్డుల ప్రకారం నాలా సర్వే నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీవాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం నయీం నగర్ నాలాను కమీషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి కొనసాగుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ నాలాకు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి ఉన్నందున 3-4 రోజుల్లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వారు ప్రెసిడెన్సీ స్కూల్ నుండి డబ్బాల బ్రిడ్జి వరకు రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సర్వే పూర్తి ఐన తర్వాత రిటైనింగ్ వాల్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపిన కమీషనర్ ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి నాలా హద్దులకు చెందిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని ఈ పరిధిలో ఉన్న కోర్టు కేసుల గురించి టౌన్ ప్లానింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ వెంకన్న ఆర్డిఓ దత్తు డి సి పి ప్రకాష్ రెడ్డి బల్దియా ఈఈ రాజయ్య ఇరిగేషన్ ఈ ఈ ఆంజనేయులు ఇరిగేషన్ డిఈఈ హర్షవర్ధన్, తహశీల్దార్ విజయ్ కుమార్ స్మార్ట్ సిటీ పిఎంసీ ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ హసన్‌పర్తి భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 రోజుల పాటు వేర్వేరుగా ఉమెన్స్ టైలర్, బ్యూటీపార్లర్, మగ్గం వర్క్‌లో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణతో పాటు కోర్సు మెటీరియల్, యోగ్యతా సర్టిఫికెట్, భోజన వసతి సౌకర్యం ఉచితంగా కల్పిస్తారని సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రోజుల పాటు వేర్వేరు కోర్సులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శిక్షణ తరగతులకు వరంగల్‌రూరల్, హనుమకొండ, జయశంకర్‌భూపాలపల్లి, జనగాం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల అభ్యర్థులు అర్హులని తెలిపారు. 18 నుండి 45 ఏళ్ల వయస్సు కలిగి తెల్లరేషన్, ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌తో పాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో స్వయంగా భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ, సంస్కృతి విహార్, హసన్‌పర్తి, హనుమకొండ జిల్లాలో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు.

నేడు పలు చోట్ల విద్యుత్ అంతరాయం

- రెండు గంటల పాటు నిలిపివేత

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలుచోట్ల విద్యుత్ అంతరాయం కొనసాగుతుందని విద్యుత్ ఏఈలు రాంశెట్టి మౌనిక, ప్రదీప్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో వర్షం కారణంగా పలుమార్లు విద్యుత్ అంతరాయం కలుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్ పరిది కేసీ క్యాంపు, నారాయణనగర్, ఎర్రగట్టుగుట్ట, కిట్స్ కళాశాల ప్రాంతం, హసన్‌పర్తి, రామారం, భీమారం, చింతగట్టు, కొమటిపల్లి ప్రాంతాలలో లైన్ క్లియరెన్స్ కోసం ఉదయం 8-30 గంటల నుంచి ఉదయం 11-30 గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం కొనసాగుతుందని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

నేడు ఆత్మకూరులో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆవరణలో హనుమకొండ అజార హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి గుండె (కార్డియో)డాక్టర్లు, జనరల్ చెకప్ డాక్టర్లు హాజరవుతారని శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు రిజిస్ట్రేషన్ కోసం సెల్ నంబర్లను 9391009726, 8688319805 సంప్రదించవచ్చునని తెలియజేశారు.

రాహుల్ గాంధీ ప్రధానికావడం ఖాయం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధిక సంఖ్యలో సీట్లు గెలిచి కేంద్రంలో అధికారం చేపట్టి దేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని జిల్లా అధికార ప్రతినిధి రావుల వెంకట రమేష్‌గౌడ్ అన్నారు దేశంలోని ప్రజలు రాహుల్ గాంధీని భారతదేశ ప్రధానిగా చూడాలని ఉత్సాహంగా ఉన్నారని ఆయన అన్నారు పేదలకు బడుగు బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉం టుందని వారి సంక్షేమంకోసం బాధ్యతాయుతంగా పనిచేస్తుందని అన్నారు. వరంగల్ గడ్డమీద డాక్టర్ కడియం కావ్య లక్ష మెజారిటీతో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

నవతెలంగాణ-నడికూడ



మండలంలో ఎమ్మెల్సీ ఎలక్షన్ సందర్భం గా, మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్ఎస్‌యుఐ లీడర్స్ అందరూ కలిసి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దేవేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మలహాలరావు మాట్లాడుతూ వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తీన్మార్ మల్లన్న టీం పరకాల నియోజకవర్గ ఇన్చార్జి కొంగస్టీ రాజుకుమార్, తీన్మార్‌మల్లన్న టీం కొవరాజు సాగర్‌లు మల్లన్న కి నడికూడ మండలంలో అధిక మెజార్టీ ఇవ్వాలని సమావేశంలో నాయకులను కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో మండల సమన్వయ కమిటీ సభ్యుడు పెద్దబోయిన రవీందర్ యాదవ్,14 గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యకులు, కాంగ్రెస్ యూత్ లీడర్స్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కాంగ్రెస్ నా యకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి నేలవాలిన తోటలు

నవతెలంగాణ-శాయంపేట



మండల పరిధిలోని గ్రామాలలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి, ఈదురు గాలులకు మక్కజొన్న, అరటి తోటలు నేలవాలాయి. మండలంలోని గంగి రేని గూడెం గ్రామానికి చెందిన ఎండి.నాసర్ మహమ్మద్ రబీ సీజన్లో మొక్కజొన్న పంట సాగు చేయగా పంట చేతికి అంది వస్తుందనుకున్న తరుణంలో వర్షానికి నేల వాడడంతో రైతు కన్నీరు మున్నీరయ్యారు. శాయంపేట, కొత్తగట్టు సింగారం గ్రామంలో అరటి తోటలు నేలవాలడంతో శుక్రవారం హార్టికల్చర్ అధికారి మధులిత సందర్శించి పరిశీలించారు. పంట నష్టం నివేదిక తయారు చేసి ఉన్నతాధికాలకు అందజేస్తానని తెలిపారు.

ధాన్యం తడవకుండా సదుపాయాలు కల్పించాలి

నవతెలంగాణ-పర్వతగిరి

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తగిన సదుపాయాలు కల్పించాలని అఖిలభారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ కోరారు. మండలంలోని జమాల్‌పురంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆ సంఘం నాయకులు సందర్శించి నేరుగా రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడవకుండా పరదాలు అందించి తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. తాలు పేరుతో ఒక బస్తాకు నాలుగు కిలోల చొప్పున తరుగు తీసివేసి మిగతా ధాన్యానికి రైతుకు తెలవకుండానే వారి అకౌంట్లో డబ్బులు వేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యానికి సరిపడా రావాల్సిన డబ్బులు అక్కౌంట్లో వేయాలని, మిల్లర్లు కుమ్ముక్కై రైతుల ధాన్యాన్ని దోచుకొని తింటున్నారన్నారు. ఈ దోపిడీపై అధికారులు స్పందించి రైతులకు నష్టం జరగకుండా ఆదుకోవాలని కోరారు.

కార్యక్రమంలో పాల్గొన్న వారు గోనే రామచందర్, రౌతు శ్రీనివాస్, జక్కా అశోక్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ సీఎస్ శాంతకుమారి



నవతెలంగాణ-సుబేదారి

ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివద్ధి పనులను నాణ్యంగా గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎ.శాంత కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధరణి పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు, చేపట్టనున్న పనులు, పనులపై జిల్లాల కలెక్టర్లతో చర్చించారు. వాటి వివరాలను సీఎస్ ఆయా జిల్లాల కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండాలని, డ్యూయల్ డెస్క్ లు, పెయింటింగ్ పనులు ఎక్కువ కాలం మన్నికగా ఉండేలా సంబంధిత ఏజెన్సీలు పాఠశాలల్లో సమకూర్చే విధంగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రజావాణికి ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ధరణికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు చొరవ తీసుకొని వాటని పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోని రెండు మండలాల పరిధిలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను మెప్మా ఆధ్వర్యంలోని ఏడు ఎస్‌హెచ్‌జీ బృందాలకు కుట్టడానికి అందించామని, అదేవిధంగా డీఆర్డీవో శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టి అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివరించారు.

ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యాలత, డీర్డీవో నాగ పద్మజ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, పౌర సరఫరా కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నాగేశ్వర్ రావు, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లో లెవెల్ వంతెన కలేనా ?


ఫైల్ ఫొటో


ఫైల్ ఫొటో

- వర్షాకాలం వచ్చిందంటే జాతీయ రహదారి బంద్
- టెండర్లు పూర్తైనా ప్రారంభం కాని పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

నవతెలంగాణ-ఆత్మకూరు

వర్షాకాలం వచ్చిందంటే ఆత్మకూరు మండలంలోని 163వ జాతీయ రహదారిపై ఉన్న కటాక్షపూర్ పెద్ద చెరువు పై ఉన్న లోలెవెల్ వంతెన పై మత్తడి వరద 5 అడుగుల ఎత్తులో ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయి జాతీయ రహదారి ఒకటి రెండు రోజులు పూర్తిగా బంద్ అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. వర్షాకాలం వచ్చిందంటే ఏటూరునాగారం, మంగపేట, ములుగువాసులు చిన్న వాహనాల్లో, వరంగల్ హైదరాబాద్ వెళ్లాలంటే కటాక్షపూర్ లోలెవెల్ వంతెన దాటి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అలా లోలెవల్ వంతెన పై వరద ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు పడి మత్తడిలో వాహన చోదకులు పడి గాయాలైన సంఘటనలు కోకొల్లలు. ఎన్నో సంవత్సరాలుగా కటాక్షపూర్ చెరువుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి చుట్టూ గ్రామ ప్రజలు వాహనదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది ఇదే మార్గం బ్రీడ్జి గుండా కేసీఆర్ ప్రచారంలో భాగంగా ప్రయాణిస్తూ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదన పంపాలని అధికారులు ఆదేశించి ఏడాది గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం కాకపోవడం శోచనీయం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు పూర్తయ్యాయి. అయినా ఈ సంవత్సరం వర్షాకాలం రాబోతున్న తరుణంలో గుత్తేదారు హై లెవెల్ వంతెన నిర్మాణం పనులు ఇంకా ప్రారంభించకపోవడం తో వాహనదారులు హౌజుబుజుర్గు, కటాక్షపూర్ గ్రామాల ప్రజలు, సంబంధిత అధికారుల, గుత్తేదారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. .

పనుల నిర్వహణలో అధికారులు, గుత్తేదారు నిర్లక్ష్యం

కటాక్షాపూర్ చెరువు పై హై లెవెల్ వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తయి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ వరకు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు పోవడంపై అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. టెండర్లు చేజిక్కించుకున్న వద్ధి కంపెనీ బ్రిడ్జి నిర్మాణం పనుల్లో అలసత్వం వహిస్తుందని రైతులు ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అని ప్రజలు అంటున్నారు.

వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి :

నీల రవీందర్, హౌజుబుజుర్గు



కటాక్షపూర్ చెరువు పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యి సంవత్సరం గడుస్తున్న గుత్తేదారు పనులు ప్రారంభించ కపోవడం శోచనీయమని నీల రవీందర్ అన్నారు. వెంటనే గుత్తేదారు బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణంతో రైతులకు వాహనదారులకు తగిన సౌకర్యాం కలుగుతుందని ఆయన అన్నారు..

వర్ష కాలంలో తీవ్ర ఇక్కట్లు :

షేక్ సలీంపాషా, హౌజుబుజుర్గు



వర్షాకాలం వచ్చిందంటే కటాక్షాపూర్ లోలేవల్ మత్తడి దాటాలంటే తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు వర్షంతో రాహదారి 10/15/ రోజులు కటాక్ష పూర్ హౌజుబుజుర్గు గ్రామ, రైతులు ప్రజలు వ్యవసాయం కై దాటిపోవడం తీవ్ర ఇబ్బందులు పడుతుంటామని షేక్ సలీంపాషా అన్నారు. వర్షాకాలం వచ్చిందంటే చెరువుకట్ట కింద పోలాలు, చేలల్లో పనులకు వెళ్లలేక రైతులు ఇబ్బంది పడుతుంటాం వెంటనే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్అండ్‌బీ డీఈ వివరణ

కటాక్ష పూర్ జాతీయ రహదారి వద్ద హై లెవెల్ వంతెన నిర్మాణం తో పాటు హౌజుబుజుర్గు గుండా సింగారం వెళ్ల సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అనుకూలంగా వంతెన నిర్మాణంలో డిజైన్ మార్పు చేసి వాటిని ఆమోదం కై (మినిస్టీరి రోడ్డు అండ్ ట్రాన్స్‌ఫోర్ట్ అథారిటీ అఫ్ ఇండియా) (జాతీయ రహదారుల సంస్థ) నేషనల్ రోడ్ అండ్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ కి నివేదిక పంపడం జరిగింది. వారి ఆమోదం వచ్చిన వెంటనే(వర్షాకాలం) గడిచిన వెంటనే నిర్మాణం ప్రారంభిస్తామని రోడ్డు భవనాల శాఖ డిఇ కిరణ్ కుమార్ తెలిపారు.

గ్రామాల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం



- నామమాత్రంగా నిషేదం
- ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-వరంగల్

పర్యావరణాన్ని కాలుష్యమయంగా మారుస్తూ.. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న వాటిలో ప్లాస్టిక్ భూతం ఒకటి. అవసరానికి వినియోగించి నేలపై పడేస్తుండడంతో వ్యర్థాలు భూమిలో కలిసిపోయి వినాశనాన్ని సష్టిస్తున్నాయి. వాతావరణ మార్పులను తారుమారు చేయడమే కాకుండా నేల సారం తగ్గుదలకు ఆజ్యంపోస్తున్నాయి. భూగర్భ జలవనరులను దెబ్బతీస్తున్నాయి.. ఇలాగే కొనసాగితే.. వినాశనం ఇలాగే కొనసాగితే జీవించడం కష్టతరంకానుంది. ఈ నేపథ్యంలో భూమిని రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల చర్యలు చేపడుతున్నాయి. దేశ ప్రజలు వాటి వాడకాన్ని నిరోధించాలని దేశ ప్రధానమంత్రి పిలుపునిచ్చినా... అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యంచేరడం లేదు.

జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీలకుగాను కేవలం కొన్ని గ్రామాల్లో మాత్రమే ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలు అవగాహనకు వచ్చారు. మిగతా పంచాయతీల్లో దుకాణదారులకు నోటీసులిచ్చినా ఫలితం దక్కలేదు. ముఖ్యంగా ఫాస్ట్‌ఫుడ్, మాంసం విక్రయ దుకాణాలు, కిరాణా దుకాణాలు, హోటళ్లలో విచ్చలవిడిగా ప్లాస్టిక్‌బాగ్‌లను ఉపయోగిస్తున్నారు.

చెప్పారు.. మరిచారు...

ఎలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలు వాడినా చర్యలుంటాయని మండలంలో కొందరు అధికా రులు హడావుడి చేశారు. తరువాత పట్టించుకునే నాథులే లేరని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో 30 రోజుల ప్రణాళి కలో భాగంగా చేపట్టిన ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణలో కొంతమాత్రమే పోగేశారు. ప్రారం భంలో హడావుడి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ తరవాత మిన్నకుండిపోయారు. కొన్ని గ్రామాల్లో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామ శివార్లలో నిల్వ చేశారు. గాలులు, వర్షాలకు చెల్లాచెదరవుతోంది. కొన్ని గ్రామాల్లో తూతూ మంత్రంగానే సేకరిస్తున్నారు. వ్యర్థాలు తగ్గించే దిశగా సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల వాడకాన్ని తగ్గిస్తేనే మేలని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు చెబుతున్నప్పటికీ చాలా గ్రామాల్లో ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిసారించాలి

- స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ సెంటర్‌లు ప్రారంభం
- స్టిచ్చింగ్ సెంటర్ ప్రారంభించిన డీపీఎం భవాని



నవతెలంగాణ-వరంగల్

మహిళలు వివిధ కార్యక్రమాలు ద్వారా ఆదాయ అభివద్ధితో ఆర్థిక ప్రగతి సాధించాలని డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ భవాని అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో డిఆర్డిఓ కౌసల్యాదేవి ఆదేశానుసారం గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ సెంటర్లను సందర్శించి ప్రారంభించారు. అలాగే మండలంలోని కొత్తపల్లి చెన్నారం గ్రామాల్లో ఏపీఎం వేణు స్టిచ్చింగ్ సెంటర్ లను ప్రారంభించారు. అనంతరం డీపీఎం భవాని ఇల్లందలో గల గంగా గ్రామైక్య సంఘం నెలసరి సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని అన్నారు. అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ ప్రాసెసింగ్. పిఎం ఈజిపి, పీఎం ఎఫ్ఎంఈ, ఎస్వీఈపి సిహెచ్‌సి,ఎఫ్‌సి ఆర్థిక తోడ్పాటును అందించడం జరుగుతుందన్నారు. ఈ సదవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వేణు సీసీలు గోలి కొమురయ్య, టి.రమేష్, స్వామి, పంచాయతీ కార్యదర్శి రామారావు, గంగా గ్రామైక్య సంఘం ప్రతినిధులు భాను, బొంతల మౌనిక, మేడం కవిత, ఎల్లమ్మ, సఫియా,ఇల్లంద, కొత్తపెల్లి వివోఏలు ఆకుల స్రవంతి, కానూరి రమాదేవి, సరిత, కారోబార్ రాజు, చోటేమియా తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అరెస్టు

- 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నవతెలంగాణ-శాయంపేట

జల్సాలకు అలవాటుపడి డబ్బులు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తూ పట్టుబడగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పరకాల ఏసిపి కిషోర్‌కుమార్ తెలిపారు. ఏపీసీ కథనం ప్రకారం మండలంలోని వసంతపూర్ గ్రామానికి చెందిన ముక్కెర సాయిచరణ్ హైదరాబాదులోని బోడుప్పల్ లో నివసిస్తున్నాడు. ఆ ఏరియాలో ఉండే భూక్య ఆజాద్‌తో పరిచయం పెంచుకొని ఇద్దరు కలిసి సినిమాలకు, షికార్లకు వెళ్తూ జల్సాలు చేస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డారు. జల్సాలకు డబ్బులు లేకపోవడంతో ఆ ప్రాంతంలోని ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలించి ఎవరికీ అనుమానం రాకుండా హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని వసంతపూర్ గ్రామంలో ఉన్న అవినాష్, హరికృష్ణకు దొంగిలించిన ద్విచక్ర వాహనాలను అప్పగించి వారితో వాహనాలను అమ్మించి వచ్చిన డబ్బులను వాడుకునేవారు. బోడుప్పల్ ప్రాంతం నుండి స్కూటీ, హోండా షైన్, పల్సర్‌బైక్ లను చోరీ చేయగా, శాయంపేట నుండి ఒక స్కూటీని దొంగతనం చేసి అప్పగించినట్లు తెలిపారు. నెలలో నాలుగు బైకులు చోరీ చేసినట్లు వివరించారు. ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను ఎస్సై ప్రమోద్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ సాధన్, ఖలీల్, హెచ్‌జి నరేష్ చాకచక్యంతో పట్టుకొని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహన దొంగలు బోడుప్పల్ కు చెందిన ముక్కెర జాన్‌విల్సన్ అలియాస్ సాయి చరణ్ అలియాస్ లడ్డు, భూక్య ఆజాద్ అలియాస్ అజ్జి, వసంతాపూర్‌కు చెందిన ముక్కెర అవినాష్, మేకల హరికృష్ణలను శుక్రవారం అరెస్టు చేసి, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పర్చినట్లు ఏసీపీ కిషోర్ కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహన దొంగలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై ప్రమోద్ కుమార్, పోలీస్ కానిస్టేబుళ్ల సాధన్, ఖలీల్, నరేష్‌లను ఏసీపి, శాయంపేట సిఐ రంజిత్‌రావు అభినందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పత్తిపాకకు చెందిన బిల్లా ఎల్లయ్య అనారోగ్యంతో మరణించాడు. శుక్రవారం మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి సందర్శించి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.2వేల నగదు ఆర్థిక సహాయం అందించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఎల్కతుర్తి

మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఏఈ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఎల్కతుర్తి, కోతులనడుమ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఎల్కతుర్తి మండల పరిదిలోనీ దామెర, చింతలపల్లి, ఇందిరానగర్, గోపాలపూర్, బావుపే ట్, కోతులనడుమ, వీరనారాయణపూర్, వల్బాపూర్ మరియు పెంచికల పేట ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

బల్దియాలో పనిచేయని జిరాక్స్ మిషన్లు

నవతెలంగాణ-వరంగల్

బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఎస్టాబ్లిష్మెంట్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాలలో కార్యాలయాలకు సంబంధించిన నకలు పత్రాలను తీసుకోవడానికి జిరాక్స్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఒక ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో తప్పమిగతా విభాగాలలో జిరాక్స్ మిషన్లు పనిచేయక పోవడంతో మూలకు పడ్డాయి. బల్దియాలో స్టేషనరీ కోసం ఒక అధికారిని ఏర్పాటు చేసి పెన్నులు,పేపర్లు వంటి ఇతరత్రా వస్తువులను కొనుగోలు చేసి అందజేసేది. 2017లో అప్పటి బల్దియా కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ కార్యాలయానికి సంబంధించిన కార్యక్రమాలు ఈ గవర్నెన్స్ విధానం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ మహానగరపాలసంస్థకు అవార్డు కూడా వచ్చిన విషయం విదితమే. అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ గవర్నెస్ విధానం అమలైనప్పటికీ ముఖ్యవిభాగాలు అయినా వాటిలో జీరాక్స్ మిషన్లు ఏర్పాటు చేసినా అవి ప్రస్తుతం ఒక్క ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో ఇటీవల పాత జీరాక్స్ మిషన్ పలుమార్లు మొరాయిస్తున్నపుడు మూడు నెలల క్రితం కొత్త జీరాక్స్ మిషన్ తీసుకువచ్చారు. కానీ మిగతా మూడు విభాగాలలో మాత్రం జీరాక్స్ మిషన్ పని చేయక పోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా త్వరగా జీరాక్స్ మిషన్లు మరమత్తులు చేయాలి, లేకపోతే కొత్త జీరాక్స్ మిషన్లు ఏర్పాటు చేయాలనే వాదనలు బలంగా వినవస్తున్నాయి.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము

నవతెలంగాణ-కొడకండ్ల

గురువారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిందని, వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడం వల్ల అకాల వర్షాలకు రైతులు పండించిన ధాన్యం తడిసి ముద్దయిందని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ప్రభుత్వం వైఫలమైందని, రైతులు పండించిన వరి ధాన్యానికి రూ.500 బోనస్ అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, వెంటనే రైతులకు బోనస్ చెల్లించడంతోపాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



ఉరుములు మెరుపులతో దంచి కొట్టిన వాన

- వేసవి దుక్కులు దున్నుకోవచ్చని రైతుల్లో ఆనందం
- కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులు

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో వానదంచి కొట్టింది. పగటి పూట ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం పూట ఆకాశం మేఘావృతమై రాత్రి పూట గాలి దుమారంతో వర్షము కురిసింది. సాలేటి వాన పడినది రైతులు అంటున్నారు. ఈ వానతో వేసవి దుక్కులు దున్ను కోవచ్చని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులు దున్నడం వల్ల భూమి లోపలి పొరలు యండకు ఎండి భూమిలో నత్రజని శాతం పెరుగుతుందని వ్యవసాయ శాఖ నిపుణులు కూడా చెబుతున్నారు. కాగా నల్ల రేగడి భూములలో మాత్రం వర్షం పడకముందే వేసవిలోనే ట్రాక్టర్ ద్వారా ఫ్లోవ్‌తో దుక్కులు చేస్తారు. తేలికపాటి ఎర్రచెక్క భూములు మాత్రం వర్షం పడినతర్వతనే దున్నకాలు చేపడతారు. వేసవిలో వాన చినుకులు పడడంతో గొర్రె మందకు కూడా పచ్చిక ఏర్పడుతుందని గొర్లకాపర్లు కూడా సంతోషంతో ఉన్నారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కానీ రైతులు మాత్రం అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం వీలైనంత తొందరలో కొనుగోలు చేస్తే మాకు ఇటువంటి తిప్పలు తప్పేవి అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- ఆర్డీవో ధరంసోత్ వెంకన్న

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

రెవెన్యూ పరిధిలో పెండింగులో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్టేషన్‌ఘనపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి ధరంసోత్ వెంకన్న ఆదేశించారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో తన కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధి స్టేషన్‌ఘనపూర్, చిల్పూర్, జాఫర్‌ఘడ్, పాలకుర్తి,కొడకండ్ల మండలాల తహశీల్దార్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ధరణిలోని పెండింగ్ దరఖాస్తులు, భూమి సర్వే అందిన దరఖాస్తులు,సీఎం పేషీ నుండి వచ్చిన దరఖాస్తులు, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ దరఖాస్తులు పెండింగులో ఉంటే, వీలైనంత త్వరగా పరిష్కరించి నివేధికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, చిల్పూర్ సరస్వతి, ఆంజనేయులు, వెంకటేశం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్నను గెలిపించాలి


నవతెలంగాణ-బచ్చన్నపేట

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షులు ఇంచార్జ్‌గా మహ్మద్ అఖిల్ పాష, అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలాధ్యక్షులు నూకల బాల్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సన్నాహక సమావేశం శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుకు అందరం సమిష్టిగా పనిచేయాలని,ఓటర్లను రెండవ నెంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సూచించారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి : వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-లింగాలఘనపురం

ఉద్యోగులందరికీ 50 శాతం పీఆర్‌సిని వెంటనే అమలు చేయాలని, పెండింగులో ఉన్న నాలుగు డిఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మట్టపల్లి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలు ఒకే దగ్గర పని చేస్తున్న అన్ని తరగతుల ఉద్యోగులను బదిలీ చేయాలని, పార్లమెంటు ఎన్నికలలో పనిచేసిన ఉద్యోగ అందరికీ ఒకే విధమైన టిఏ, డిఏలు చెల్లించాలని, రాష్ట్రం మొత్తం ఒకే విధంగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.



బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పర్యటించారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన నీరటి సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సముద్రాల గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఇమ్మడి ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతుండగా వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు బెలిదే వెంకన్న, సీనియర్ నాయకులు కత్తుల కట్టయ్య, మండలాధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, పిల్లి సుధాకర్, పడిశాల వెంకటేష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పరామర్శ

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన బోయిని ఉప్పలయ్య మృతి చెందగా శుక్రవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పోగుల సారంగపాణి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. వీరితో పాటుగా మాజీ వార్డు సభ్యులు పొన్న రాజేష్, కాంగ్రెస్ నాయకులు చేపూరి ప్రభాకర్, పొన్న రాజేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఆర్థిక ప్రగతిని పెంచేందుకే సహకార సంఘాలు

- కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

నిరుపేదలు, రైతుల ఆర్థిక ప్రగతి పెంచేందుకు, ఆయా కుటుంబాలను బలోపేతం చేసేందుకు గ్రామస్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవ సహకార సంఘాలు, పాల ఉత్పత్తుల సహకార, సంఘాలు, మత్స్య సహకార సంఘాలు, కల్లుగీత కార్మిక సహకార సంఘాల ద్వారా సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి నిరుపేదలు, రైతుల ఆర్థిక ప్రగతి పెంచేందుకు సహకార సంఘాల ద్వారా సేవలు అందిస్తున్నట్లు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల అవసరాలను గుర్తించి అందుకు తగినట్లుగా ప్రాధాన్యత గల అంశాలను ఎంచుకొని గ్రామస్థాయిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ల నిర్మాణం, జన ఔషధ మందుల షాపుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తొలివిడతగా సహకార శాఖ గుర్తించిన సహకార సంఘాలలో పెట్రోల్ బంక్‌ల నిర్మాణం, జన ఔషధ మందుల షాపుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్య సహకార సంఘాలు, పాల ఉత్పత్తుల సహకార సంఘాలు అభివృద్ధి పరిచేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో రైస్ మిల్స్, పెట్రోల్ బంక్స్ వంటి వాటికి కొరత ఉన్నందున సహకార సంఘాల ద్వారా పైన పేర్కొన్నవాటిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. గోడౌన్ల నిర్మాణం చేపట్టడం ప్రశంసనీయమన్నారు. గొర్రెల పెంపకానికి డిమాండ్ ఉన్నందున పశుసంవర్ధక శాఖ సహకారంతో గొర్రెల పెంపకం, విక్రయాలు, మార్కెట్ సదుపాయాలతో నిరుపేదల ఆర్థిక అభివృద్ధి పెరిగే అవకాశం ఉన్నందున దృష్టి సారించాలన్నారు.



మలివిడతగా హౌసింగ్, కల్లుగీత కార్మికుల సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ సహకారంతో మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని తద్వారా మహిళలు మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, సహకర శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి మనోహర్, మత్స్యశాఖ అధికారి నాగులు, డీసీసీబీ అధికారి నవీన్, విజయ డైరీ అధికారి హరి కృష్ణ, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిష్ణాజిగూడెంలో వాటర్‌ప్లాంట్ మూత

- రెండు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు
- వాటర్ ప్లాంటు తెరిచి నీరందించాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చిల్పూర్ మండలం క్రిష్ణాజి గూడెం గ్రామంలో మినరల్ వాటర్ మూతపడటంతో ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. పరిసర గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా సక్రమంగా సాగినా.. మినరల్ వాటర్‌కు అలవాటు పడిన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ ప్రజలు స్థానికంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను నమ్ముకుని ఉన్నారు. దాదాపు రెండు నెలలుగా మినరల్ వాటర్ ప్లాంటు మూత పడటంతో మినరల్ నీరు లేక అల్లాడుతున్నారు. పరిసర గ్రామాలకు వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రెండేళ్ల పరిమితి కాలంతో గ్రామ పంచాయితీ ఒప్పందంతో అప్పజెప్పింది. ఈజూన్ నెలతో ఆఒప్పందం ముగుస్తుంది. కానీ వాటర్ ప్లాంటులో మిషన్ మరమ్మతులకు నోచుకోవడంతో బాగుచేయకుండా నిర్వహకుడు మామూలు సాదాసీదా నీటిని అందిస్తున్నాడని, అడిగితే సాకు చెప్పి కాలం వెళ్లదీసున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. జీపీ అధికారికి ఫిర్యాదు చేయడంతో సదరు వ్యక్తిని పిలిపించి పలుమార్లు చెప్పినా వినకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మినరల్ నీరు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మా గోస పట్టించుకునేదవరు : సాదం శ్రీనివాస్,



తాగు నీటి కోసం రెండు నెలలుగా సతమవుతున్నాం. కనీసం తాగు నీరు కూడా ఇవ్వకుండా ఎందుకు ఇబ్బందులు.. మా పై దయవుంచి తాగు నీరు అందించాలని కోరుతున్నాం.

చర్యలు చేపడుతున్నాం : పంచాయితీ కార్యదర్శి రాంబాబు



వాటర్ ప్లాంటులో మిషన్ మరమ్మతులకు నోచుకోవడంతో సదరు నిర్వహకుడికి పలుమార్లు హెచ్చరించాం. తీరు మారలేదు. మిషన్ భగీరథ నీరు మాత్రం సజావుగా ప్రతీ ఇంటికీ సరఫరా అవుతుంది. ఇప్పటికే మరమ్మత్తులు చేపడుతున్నం. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా మినరల్ నీటిని అందిస్తాం.

ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించాలి

- నెలాఖరుకల్లా పెండింగ్ దరఖాస్తులను పూర్తిచేయాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్ల, పెండింగ్ ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, విద్యార్థుల యూనిఫాం కుట్టు పనులు, పాఠశాలల మౌలిక వసతులపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు, సలహాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జూన్ 12న పాఠశాలల రీఓపెనింగ్ ఉన్నందున అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులను వేగవంతం చేయాలన్నారు. టాయిలెట్స్, విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే జిల్లాకు యూనిఫాం క్లాత్ వచ్చినందున నాణ్యతను సరిచూసుకోవాలని, విద్యార్థుల యూనిఫాం కుట్టు పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ పనులపై ప్రతి రోజూ నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులను ఈ నెలాఖరుకల్లా పూర్తిచేయాలని సూచించారు. మిగిలిన ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తిచేసి, సకాలంలో రైస్ మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. అదే విధంగా రోజువారీ లక్ష్యాలుగా సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్సీఐకి పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, డీసీఎస్ఓ రోజా రాణి, డీఆర్డీఓ మొగులప్ప, డీఈఓ రాము, డీఏఓ వినోద్ కుమార్, డీఎం సీఎస్ ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ-జనగామ

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృ ద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయా లని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో గల మండల ప్రజా పరిషత్ పాఠశాల (ఎంపీపీఎస్)ను సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తాగునీటి సంపులు, మరుగుదొడ్లను పరిశీలించి, పకడ్బందీగా నిర్మించాలని సూచించారు. అలాగే వాష్ ఏరియా బేసిన్‌లలో ట్యాప్‌లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్తు, కాంపౌండ్ వాల్, గేట్, తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీసి, తగిన సూచనలు చేశారు. ఎటువంటి నిర్లక్ష్యం తగదని, ఈ గుర్తించిన పనులను వేగవంతం చేసి, ఈ నెల 25లోగా పూర్తిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డీఈఓ రాము, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు

నవతెలంగాణ-ఇనుగుర్తి

మండల కేంద్రంలోని చిన్ననాగారం గ్రామపంచాయతీ పరిధి నుండి సీతారాంపురంకు వెళ్లే దారి గుంతల మయంగా మారి అకాల వర్షానికి నీరు నిల్వ ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. విషయం గమనించిన బీఆర్ఎస్ డివిజన్ యూత్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ రెడ్డి సొంత నిధులతో రోడ్డుకు మరమత్తులు చేశారు. ఈ కార్యక్రమంలో బండారి రామిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, భూక్య బాలాజీ నాయక్, బొబ్బల్ల ముత్తయ్య, బత్తిని మురళి, శరత్, హరి ప్రసాద్ కార్యదర్శి రాజేశ్వర్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

నవతెలంగాణ-బయ్యారం

తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్ బోర్డు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారని, ఈ నెల తొమ్మిది నుంచి ఫస్ట్ ఫేజ్ అప్లికేషన్ల ప్రక్రియ మొదలైందని కళాశాల ప్రిన్సిపాల్ కోటేష్ తెలిపారు. దరఖాస్తుకు మే 31 చివరి తేదీఅని తరగతులు జూన్ 1 నుండి ప్రారంభం అవుతాయని తెలిపారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 2023-24 విద్యా సంవత్సరం మార్చిలో ప్రకటించిన ఫలితాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 87 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో మొదటి స్థానం, ఇంటర్ ప్రథమ సంవత్సరం 73 శాతంతో జిల్లాలో రెండోస్థానంలో నిలిచిందని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను మొదటి దఫా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా కళాశాలలో బాలబాలికలకు ఎంపీసీ, బైపిసి, సిఈసి,హెచ్‌ఈసి గ్రూపులు అందుబాటులో ఉండి తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో విద్యాబోధన సౌలభ్యంతో పాటు ఒక్కో గ్రూపులో 40 సీట్ల లభ్యత కలదని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరితే విద్యార్థులకు పలు ప్రయోజనాలు ఉన్నాయని, ఉచిత ప్రవేశం, విద్య, పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు, తెలుగు,ఆంగ్ల మాధ్యమాలలో విద్యాబోధన, విశాలమైన క్రీడా ప్రాంగణం, లైబ్రరీ సౌకర్యం కలదని తెలిపారు. కళాశాలలో అధ్యాపకుల కొరత లేదని, ఉన్నత విద్యార్హతలు కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో దరఖాస్తులు సమర్పించవచ్చునని, లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

దళితుల స్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు

నవతెలంగాణ-ఇనుగుర్తి

తమకు దహన సంస్కారాలకు దానంగా ఇచ్చిన స్మశాన వాటిక స్థలం కబ్జా అవుతోందంటూ గ్రామస్తులు ధర్నాకు పూనుకున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని దళితులకు గత 70 సంవత్సరాల క్రితం భూమి సర్వే నెంబర్ 512 లో 27 గుంటలు మరియు ఎకరం భూమి స్థలాన్ని దళితులకు స్మశాన వాటిక కోసం ఒద్దిరాజు సోదరులు దానంగా ఇచ్చారని, అయితే ఈ స్థలాన్ని అదే సామాజిక వర్గానికి చెందిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి ఆక్రమించారని దీనిపై దళితులంతా కలిసి శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కేటాయించిన భూమిలో గత కొద్ది దశాబ్దాల కాలంగా దళితులమంతా దహన సంస్కరాలు చేస్తున్నామని, ఈ స్థలాన్ని మాజీ ప్రజా ప్రతినిధి జేసీబీ సహాయంతో చదును చేసుకుని ఆక్రమించారని వాపోయారు. స్మశాన వాటిక స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు.



జి-మార్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఇనుగుర్తి

మండల కేంద్రంలోని చిన్న బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జి మార్ట్‌ను శుక్రవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ప్రారంభించారు. గ్రామాలలో సరికొత్త షాపింగ్ అనుభవం కల్పించాలని ఉద్దేశంతో ఈ మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు కంపెనీ యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



భూదాన్ సమస్యకు పరిష్కారం ఏది..!?

- ఉత్తర్వులు వచ్చిన పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-చిన్నగూడూరు

మండల కేంద్రంలో నెలకొని ఉన్న భూదాన్ సమస్యలపై నీలి మేఘాలు ఎన్నటికీ వీడటం లేదు. గత రెండు సంవత్సరాల క్రితం భూదాన్ సంస్థాన్ నుంచి ఉత్తర్వులు జారీ చేసిన కూడా నాటి ప్రభుత్వం అధికార బలంతో ప్రభుత్వ భూములపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మండల కేంద్రానికి చెందిన ఓ రైతు భూమి భూదానోద్యమానికి అందించినటువంటి రికార్డ్ సర్వే నెంబర్ 170, సుమారు 6 ఎకరాలు భూదాన్ బోర్డు ద్వారా చిన్న గూడూరు తాహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో విచారణచేసి సంబంధించిన భూమిని స్వాధీనం చేసుకోకపోగా మీన వేషాలు వేస్తూ నాటి నుండి నేటి వరకు రెవిన్యూ యంత్రాంగం భూదాన్ భూములు కొనుగోలు చేసిన వ్యక్తి దగ్గర మామూలు వసూలు చేస్తు చేతులు దులుపుకున్న సంగతి మండలంలో గుప్పు, గుప్పు మంటుంది. ఎన్నటికైనా నాడు భూదానోధ్యామంలో ప్రభూత్వానికి రాసినటువంటి భూములను తిరిగి నిరుపేద, నిరాశ్రయులకు, భూమిలేని నిరుపేదలకు అట్టి భూములను పంచి నిరుపేదలకు సాయం చేయాలని మండల కేంద్రంలోని భూమిలేని నిరుపేదలు కోరుతున్నారు. భూధాన్ భూములపై చరవాణి ద్వారా స్థానిక తహసీల్దార్ వివరణ కోరగా ఆయన అందుబాటులో లేరు.

ప్రభుత్వం ఆదుకోవాలి : బర్పటి నాగమ్మ



మండల కేంద్రానికి చెందిన ఎస్సీ కులస్తురాలని కూలీ, నాలీ చేసుకొని బ్రతుకుతున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. కుటుంబ పోషణ కోసం అనేక అవస్థలు పడుతున్నాను. నిరుపేదరాలైన నాకు ప్రభుత్వ భూమిని కొంత మేరకైనా సహాయం చేసి నన్ను నా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.



తండా ధర్మారంలో ఇసుక డంపు సీజ్

నవతెలంగాణ-మరిపెడ

అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపును మరిపెడ మండల పోలీసు రెవెన్యూ శాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండా ధర్మారం శివారులోని ఆకేరు వాగు నుంచి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 150 ట్రిప్పుల ఇసుకను ప్రైవేట్ ప్రాంతంలో డంపు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నేడు దాడులు నిర్వహించగా ఇసుక అక్రమ రవాణాను గుర్తించి, ఈ మేరకు డంపు సీజ్ చేశారు.

సీఆర్పీఎఫ్ బలగాలకు సన్మానం



నవతెలంగాణ-మరిపెడ

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గడచిన రెండు నెలలుగా తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం బందోబస్తు నిమిత్తం సిఆర్పిఎఫ్ బలగాలను పంపించారు. మే 13న లోకసభ ఎన్నికల ముగియడంతో మహబూబాబాద్ జిల్లాకు కేటాయించిన బలగాలు శుక్రవారం తిరిగి వెళ్ళిపోయాయి. ఈ సందర్భంగా మహబూబాబాద్ పోలీస్ శాఖ బలగాలకు ప్రత్యేక వీడ్కోలు పలికింది. మరిపెడ సిఐ హతిరాం నాయక్, సెకండ్ ఎస్ఐ గంద్ర సంతోష్ జవాన్లకు శాలువాతో సత్కరించి మానుకోట రైల్వే స్టేషన్‌లో వీడ్కోలు పలికారు. ఎన్నికల విధుల్లో తమకు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించాలి : డీఎంహెచ్‌వో



నవతెలంగాణ-మహబూబాబాద్

తండాలలో పోషకాహార లోపంతో బాధపడుతున్న బాల బాలికను గుర్తించి తగిన వైద్య సదుపాయం అందించేందుకు ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలని డిఎంహెచ్ఓ కళావతి భాయ్ ఆదేశించారు. శుక్రవారం మల్యాల పీహెచ్‌సీ పరిధిలోని వీరారం తండాను ఆక స్మికంగా సందర్శించారు. వీరారం తండాలో ఆర్‌బిఎస్‌కె బృందం చేస్తున్న పనితీరును, మందులు అందించే విధానం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తండాలో ఫ్రైడే డ్రై డే నిర్వహించా లన్నారు. తీవ్రమైన పోషకాహారం లోపంతో బాధపడుతున్న రెండు సంవత్సరాల అబ్బాయిని గుర్తించి ఎంజీఎంలోని ఎన్ఆర్‌సి విభాగానికి మెరుగైన సేవల కొరకు పంపించినట్లు తెలిపారు. పట్టణ పీహెచ్‌సీ పరధిలోని బెస్తబజార్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. ఎ.అంబరీష డిప్యూటీ డిఎంహెచ్ఓ, డాక్టర్ కుమార్, రమ, పిడిఎంఓ, శ్రీనివాస్, ఎస్‌యుఓ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఎం మండల కార్యదర్శి నంబూరి మధు



నవతెలంగాణ-బయ్యారం

మండలంలో అకాల వర్షంతో పంటలు, పండ్ల తోటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నంబూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అకాల వర్షంతో మొక్కజొన్న, వరి, మామిడి తోటలు తీవ్రంగా నష్టపోయాయని, అదే విధంగా ఇండ్ల రేకుల షెడ్లు కుప్పకూలాయని ఆయన అన్నారు. ఈ అకాల వర్షానికి నష్టపోయిన రైతాంగాన్ని, పేదలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఎరువులు విత్తనాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ఉచితంగా ఇవ్వాలని, మధ్య తరగతి రైతాంగానికి సబ్సిడీల మీద ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బల్లెం ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన వరి, మొక్కజొన్న, మామిడి రైతులను తక్షణమే ప్రభుత్వం సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

జర్నలిస్ట్ నవీన్ కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-పెద్దవంగర

విద్యుద్‌షాక్‌తో ఇటీవల మృతి చెందిన జర్నలిస్ట్ తాళ్లపల్లి నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుని, చేయూతనందించాలని సీనియర్ జర్నలిస్టులు సుంకరి ఓంకార్, జాటోత్ దామోదర్ అన్నారు. శుక్రవారం కొరిపల్లి గ్రామంలో నవీన్ కుటుంబాన్ని సీనియర్ జర్నలిస్టులు రంగు లక్ష్మణ్, బారి విక్రమ్, జాటోత్ సుధాకర్, పెద్దవంగర నివాసి సుంకరి మురళీధర్‌తో కలిసి పరామర్శించి, రూ.3500 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నవీన్ అకాల మరణం బాధాకరం అన్నారు. జర్నలిస్ట్‌గా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన జర్నలిస్టులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో రాష్ట్రంలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఇప్పటివరకు ఆదుకోవడంలేదని గుర్తుచేశారు. నవీన్ కుటుంబానికి వెంటనే రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ తాళ్లపల్లి మల్లేష్, స్థానిక నాయకులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూలీ అమలు చేయాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మార్కెట్లో ముఖ్య కార్యకర్తల సమావేశం హమాలి యూనియన్ అధ్యక్షులు మిట్టకడుపుల వెంకన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి శివారపు శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేసముద్రం మార్కెట్ పరిధిలోని కార్మికులకు పెరిగిన వేతనాలు అమలు చేయడంలో వ్యాపారుల మొండివైఖరి వీడాలని, 31డిసెంబర్ 2023న జరిగిన అగ్రిమెంట్ ప్రకారం 1 జనవరి 2024 నుండి అమలు కావలసిన నూతన రేట్లను కొంతమంది వ్యాపారులు అమలు చేయకుండా కార్మికుల శ్రమ దోపిడికి గురి చేస్తున్నారు. జనవరి ఒకటి నుండి అమలు చేయవలసిన రేట్లు అమలు చేయకుంటే కార్మికులతో ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఇప్పటికే అనేకసార్లు ఛాంబర్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి మొరపెట్టుకున్నప్పటికీ కొంతమంది వ్యాపారులు మొండి చేస్తున్నారని వారి వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు ఐఎఫ్‌టియు యూనియన్ పూనుకుంటుందని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో హమాలి యూనియన్ అధ్యక్షులు మిట్టగడుపుల వెంకన్న, కార్యదర్శి బండి రాజు, బీహార్ కార్మికులు సోహన్ యాదవ్, చందన్ కుమార్ యాదవ్, అస్లోక్ యాదవ్, హౌదేశ్ కుమార్ యాదవ్, రాజ్ బలి పాల్గొన్నారు.

లేఅవుట్ నిబంధనలు పాటించాలి

- మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్



నవతెలంగాణ-తొర్రూరు

ప్రతీ ఒక్కరు లేఅవుట్ నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైతే లేఔట్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడతారో అట్టి వారిపై మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓపెన్ ప్లాట్స్‌కు సంబంధించిన యజమానులు తమ ప్లాట్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఓపెన్ ప్లాట్స్ యజమానులు తమ కాలి ప్లాట్‌లలో నీరు నిలవ ఉండి చెట్లు పెరిగి దోమలు, ఈగలకు నిలయంగా మారాయని కావున ప్రజలకు ఇరుగుపొరుగు వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున మీయొక్క ప్లాట్లను చదును చేసుకుని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకోవాలన్నారు. లేనియెడల 2019 మున్సిపల్ చట్ట ప్రకారం ప్లాట్ల యజమానుల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లేఅవుట్ లేకుండా నిర్మాణం చేపడితే అట్టివారికి పర్మిషన్లు కూడా రద్దు చేస్తామన్నారు. ఆన్లైన్లో పర్మిషన్ తీసుకొని ఇల్లు నిర్మించుకునేవారు ఐదు ఫీట్లు సెట్ బ్యాక్‌తో ఇండ్ల నిర్మాణాలు చేసుకోవాలన్నారు. లేనిచో మున్సిపాలిటీ సిబ్బందిచే నిర్మాణాన్ని కూల్చివేయడం జరుగుతుందన్నారు. వార్డులలో ఎవరివైనా శిథిలావస్థలో ఉన్న ఇండ్లు ఉంటే తక్షణమే మున్సిపాలిటీకి సమాచారం అందించినట్లయితే అట్టి ఇండ్లను మున్సిపాలిటీ కూల్చివేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఖురేష్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంతోష్

నవతెలంగాణ-తొర్రూరు

నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణాధ్యక్షుడు సోమ రాజశేఖర్ కోరారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కేసీఆర్ వరి వేస్తే ఉరి అని మాట్లాడారని, ఆనాడు రైతులు వరి పంట పండిస్తే పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు నేడు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే రైతులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు 2 లక్షల రుణమాఫీ అవుతుందన్నారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వం పై చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ భూసాని రాము, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు జాటోత్ రవి నాయక్, నాయకులు కందాడి అచ్చిరెడ్డి, నల్లమాస సమ్మయ్య, ధరావత్ సోమన్న,నల్లపు రాజు, దీకొండ మధు, సురేందర్, అరవింద్, రాంబాబు, మహబూబ్ రెడ్డి, జలగం వెంకన్న, కుమార్ యాదవ్, చంటి, వెలుగు మహేశ్వరి, తాటికాయలు రాణి, జాటోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గాలి వాన బీభత్సం

- నోటి కాడి పంట నీటి పాలు - నిండు వేసవిలో కుండ పోత వర్షం
- జిల్లాలో 1131. 8 మిల్లీమీటర్ల వర్షపాతం
- పిడుగుపడి కాడి ఎద్దులు మృతి - విద్యుత్ సరఫరాకు అంతరాయం
- మామిడి తోటలకు తీరని నష్టం - పదివేల క్వింటాళ్లు తడిసిన ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లో 60 వేల కింటల ధాన్యం పెండింగ్
- రవాణాకు నోచుకుని 16 వేల క్వింటాళ్ల ధాన్యం









నవతెలంగాణ-మహబూబాబాద్

నిండు వేసవిలో మండు వేసవిలో కురిసిన కుండపోత వర్షం గాలి వాన బీభత్సం మానుకోట జిల్లా ప్రజలను అవతల కుతలం చేసింది. అన్నదాతకు తీరని శోకం మిగిల్చింది. రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఉరుములు, మెరుపులు పిడుగులతో ప్రారంభమైన వర్షం ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. వేసవికాలంలో వచ్చిన అకాల వర్షానికి అన్నదాతలు ఆగమయ్యారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. గాలివాన బీభత్సానికి మామిడి రైతులకు భారీ నష్టం చేకూరింది. విద్యుత్ తీగలు తెగ పడే పశువులు మృతి చెందాయి. నష్టం అంచనా వేయడంలో అధికార యంత్రాంగం విఫలమైంది.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు కురిసిన గాలి వానతో అన్నదాతకు తీరని నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా ఐకెపి, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దైంది. మండుటెండలో గన్నీల కొరత, హమాలీల సమస్య, రవాణా సమస్యలతో ధాన్యం కొనుగోలు తరలింపు మందకోడిగా సాగుతున్నాయి. దానితోడు రైతాంగానికి ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

పదివేల కింటాల్లో తడిసిన ధాన్యం...

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షానికి పదివేల క్వింటాలో ధాన్యం తడిసినట్లుగా అనధికారిక సమాచారం తెలుస్తుంది. తడిసిన ధాన్యానికి సంబంధించి ప్రభుత్వ యంత్రాంగం అధికారులు ఎలాంటి నివేదిక తయారు చేయలేదు. జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ 192 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 102 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 27,305 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 2565 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించారు. ఇంకా 1650 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సిఉంది. ఇందులో 100 మెట్రిక్ టన్నులు తడిసినట్లుగా సమాచారం తెలుస్తుంది. ఐకెపి, పిఎసిఎస్, జీసిసి మెప్మా డిహెచ్ఎస్ ద్వారా 5460 మంది రైతుల దగ్గర 16,979 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

విద్యుత్ షాక్‌తో పశువులు మృతి...

మహబూబాబాద్‌లో నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో వివిధ రకాలుగా నష్టం జరిగింది. పలు చోట్ల చెట్లు విరిగి, విద్యుత్ స్తంభాల మీద పడటంతో ప్రయాణికులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ శివారు వేంక్య తండాలో ఉదయం పశువులు మేత మేయడానికి వెళ్లడంతో అప్పటికే రాత్రిపూట తెగి నేల మీద పడిన విద్యుత్ తీగలు ఎడ్ల కాళ్ళకు తాకి అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు 2 ఎడ్లు మృత్యు వాత పడ్డాయి. దాదాపుగా 1 లక్ష నష్టం వాటిల్లిందని రైతులు కన్నీరు కారుస్తూ తమ కుటుంబ సభ్యుడిని కోల్పోయామనే అనే బాధను వ్యక్తం చేస్తున్నారు. తండ ప్రధాన రహదారిపై విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ సంఘటన జరిగిందని వెంటనే తమకు నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు ధర్నా నిర్వహించారు.

మామిడి తోటలకు తీరని నష్టం...

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మామిడి తోటలకు తిరిగి నష్టం వాటిల్లింది. అకాల వర్షానికి మామిడి తోటలు నేలరాలి రైతులు నష్టపోయారు. జిల్లాలో 15 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి.అకాల వర్షానికి కౌలు తీసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారువెయ్యి ఎకరాలలో మామిడితోటలకు నష్టం వాడినట్లుగా తెలుస్తుంది.వంద టన్నుల మామిడికాయలు నేలరాలినట్లుగా సమాచారం. మామిడి రైతులు తమకు పరిహారం కోరుతున్నారు.

జిల్లాలో 1131.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు...

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 1131.8 ఎంఎం వర్షపాతం నమోదు అయినట్లుగా అధికారులు తెలిపారు. వాస్తవంగా జిల్లా సరాసరి వర్షపాతం 70.8 మిల్లీమీటర్లు ఉంది.జిల్లాలో అత్యధికంగా మహబూబాబాద్ మండలంలో 118.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అతి తక్కువగా గంగారంలో 17.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది . అలాగే కొత్తగూడలో 19.6, బయ్యారంలో 91.4, గార్లలో 104.4, డోర్నకల్‌లో 70.0, కొరవిలో116.2, గూడూరులో 26.2, కేసముద్రంలో 39.8, నెల్లికుదరులో 104.6,చిన్నగూడూరులో 44.2,మరిపెడలో93.8, దంతాలపల్లిలో81.2, తొర్రూర్‌లో62.4,పెద్దవంగరలో42.8ఎంఎంవర్షపాతం నమోదైంది.

పెద్ద చెరువులో చేరిన వరద నీరు - ప్రవహించిన వాగులు...

బయ్యారం : మండలంలో కురిసిన అకాల వర్షంతో వాగుల్లో వరద నీరు చేరింది. బయ్యారం పెద్ద చెరువుకు వాగుల ద్వారా వరద నీరు చేరుకొని 9 అడుగులకు చేరుకుంది. బయ్యారం సమీపంలోని అలిగేరు, మున్నేరు వాగుల్లో వరద నీరు ప్రవహించాయి. పెద్ద చెరువుకు నీరు చేరడం పై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పెద్ద చెరువుగా పేరొందిన బయ్యారం చెరువు కింద వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. చెరువుకు నీరు చేరుతున్న దృశ్యాలు ప్రజలందరికీ కనువిందు చేశాయి. అకాల వర్షానికి మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలో పిడుగు పడి రైతు జక్కుల తిరుపతయ్య గేదె మృతి చెందింది. దీని విలువ సుమారుగా రూ. 80 వేలు ఉంటుందని నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

నిండా ముంచిన అకాల వర్షాలు... తేరుకోలేకున్న రైతులు...

తొర్రూర్ రూరల్ : అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. అకాల వర్షాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. వరుసగా విరుచుకుపడుతున్న వానలతో తడిసిన ఆరేలోపే మళ్లీ వర్షం కురుస్తూ అన్నదాతలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండు వేసవిలో ఓ వైపు ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగానే అంతలోనే దంచికొడుతున్న వానలతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. పంట చేతికొచ్చి ధాన్యం కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమయంలో కొన్ని రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడిన ఊహించని విధంగా వర్షం విరుచుకుపడుతోంది. దీంతో పంటతో పాటు కొనుగోలుకు తరలించిన ధాన్యం వర్షార్పణమవుతోంది. నిన్న రాత్రి కురిసిన వానకు మహబూబాబాద్ జిల్లాలో తొర్రూర్ మండలంలో నిన్న రాత్రి గంటల తరబడిగా కురిసిన వానకు కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులు ఉదయం నీళ్లలో తేలియాడాయి. తొర్రూర్ డివిజన్లోని అమ్మపురం గ్రామంలో నీటి ప్రవాహనికి కొట్టుకుపోయిన వరి ధాన్యం ఎత్తుకోలేక ఉదయం రైతులకు అవస్థలు పడుతున్నారు.

చెరువును తలపిస్తున్న కొనుగోలు కేంద్రం...

కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం నీటమునిగింది. తొర్రూర్ మండలంలో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం సుమారు 5,000 బస్తాల ధాన్యం తడిచిపోయింది. కష్టపడి పండించిన పంట నీటి పాలవటంతో పెట్టుబడి కుడా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. రాత్రి వర్షానికి కొట్టుకుపోయిన వరిధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని అందోళన

నవతెలంగాణ-గార్ల

పాకాల ఏటిపై హై లెవెల్ బ్రిడ్జిని నిర్మించడంలో గత యాభై సంవత్సరాలుగా పాలకులు వైఫల్యం చెందారని న్యూ డెమోక్రసీ మండల నాయకులు గౌని భద్రయ్య మండి పడ్డారు. పాకాల ఏటి పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని న్యూ డెమోక్రసీ అధ్వర్యంలో శుక్రవారం చెక్ డ్యాం పై అందోళన నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చెక్‌డ్యాంపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని న్యూ డెమోక్రసీ, అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో అనేక దశాబ్దాలుగా పోరాటాలు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో దాదాపుగా ఆరు నెలలు రాకపోకలు నిలిచిపోయి రాంపురం, మద్దివంచ పంచాయతీల పరిధిలో ఉన్న 10 గ్రామాలకు చెందిన వేల మంది వ్యయ ప్రయాసలతో సుమారుగా 25 కిలో మీటర్ల దూరం నుండి ప్రయాణం చేయాల్సి వస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో రైల్వే బ్రిడ్జిపై నుండి అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తుందని అందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే హరిప్రియాలు బ్రిడ్జి మంజూరు అయిందని ఉత్సాహంగా శంకుస్థాపనలు చేసిన నిర్మాణం ప్రారంభం కాక నేటికీ కలగానే మిగిలిందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్రి రవి, గౌని మల్లేష్, బావ సింగ్, డి.రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





శిలాఫలకం ముందు నిరసన...

పాకాల చెక్ డ్యాంపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత ప్రజల రాకపోకల ఇబ్బందులను తొలగించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాంపురం సమీపంలో ఉన్న పాకాల చెక్ డ్యాంపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం ముందు సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హాయంలో నిర్లక్ష్యానికి గురైన చెక్‌డ్యాం నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేసిన నిర్మాణానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాంపురం చెక్ డ్యాం పై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంపాల వెంకన్న, యం. లోకేష్, పి.కోటి తదితరులు పాల్గొన్నారు.



చెక్ డ్యాం పై నుండి పొంగిన వరదనీరు

నవతెలంగాణ-గార్ల

గురువారం రాత్రి మండలంలో కురిసిన అకాల భారీ వర్షం, గాలి దుమారం కారణంగా మండలంలోని పలు చెరువులు, కుంటలలోకి ఓ మోస్తరుగా వరద నీరు వచ్చి చేరడంతో సమీప ప్రాంతాల చెరువులలో భారీగా వరదనీరు చేరుకుంది. సుమారుగా రెండు గంటలకు పైగా కురిసిన భారీ వర్షం కారణంగా వేసవి కాలంలో చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటి వరకు అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండలు, వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు భారీ వర్షం కారణంగా చల్లదనంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా మండలంలోని రాంపురం సమీపంలో ఉన్న పాకాల చెక్‌డ్యాంకు భారీ వరదనీరు చేరుకుని చెక్ డ్యాం పై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాంపురం, మద్దివంచ పంచాయతీలోని గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎప్పుడు వర్షకాలంలో నెలల పాటు రాకపోకలకు అంతరాయం కలుగగా తాజాగా కురిసిన భారీ వర్షం కారణంగా వరదనీరు ప్రవహిస్తుండగా వేసవికాలంలోనే ఈ ప్రాంత ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. బయ్యారం చెరువు నుండి ఎర్ర కాలువ ద్వారా సీతంపేట సమీపంలోని పెద్ద చెరువుకు భారీగా వరదనీరు చేరుకుంది. నిన్నటి వరకు పూర్తిగా అడుగంటిన గార్ల పెద్ద చెరువుకు ఒక్క రాత్రిలోనే కురిసిన భారీ వర్షం కారణంగా వచ్చిన వరద నీటితో చెరువు కళ కళలాడుతుండటంతో రైతులు, ఈ ప్రాంత ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



నవతెలంగాణ-దంతాలపల్లి

మారుతున్న రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులను క్యాడర్‌కు అందించడం కోసం ఈనెల 23, 24 తేదీలలో మండలంలోని పెద్ద ముప్పారం గ్రామంలో జరుగు జిల్లా రాజకీయ తరగతులను జయప్రదం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) డివిజన్ కార్యదర్శి మంజంపల్లి వీరన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు జరుతున్న రాజకీయ మార్పులు 80 శాతంగా ఉన్న పేద సామాన్య మధ్య తరరగతి ప్రజానీకానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. శిక్షణ తరగతులకు జిల్లావ్యాప్తంగా 16 మండలాల నుండి ఎంపిక చేసిన కార్యకర్తలు హాజరుకానున్నారని తెలిపారు. క్లాసులో బోధకులుగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కేజీ రామచందర్ రాయల చంద్రశేఖర్, కే.రమ, కచ్చల రంగయ్య,పాయం చంద్రన్న తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఊడుగుల రాములు, సెగ్గం యాకయ్య, ఏర్కొండ ప్రవీణ్, మండల నాయకులు దూదిమెట్ల లింగయ్య, యుగేందర్, లింగయ్య, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు మరమ్మత్తులు చేపట్టాలి

గార్ల : ఇటీవల మండలంలో కురిసిన అకాల వర్షం, గాలి దుమారం కారణంగా ప్రమాదవశాత్తు తెగి పడిన విద్యుత్ తీగలు తగిలి పశువులు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో తక్షణమే మరమ్మత్తులు చేపట్టి పశువులు ప్రమాద బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు శనివారం ఒక ప్రకటనలో కోరారు. మూడు వారాల వ్యవధిలోనే అకాల వర్షం కారణంగా విద్యుత్ ఘాతంతో రైతులకు చెందిన పశువులు మృతి చెందాయని మరణించిన పశువుల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. తెగి పడిన విద్యుత్ తీగలకు విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మిల్లర్లు జరిమానాలు చెల్లించాలి : కలెక్టర్

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లాలో 2020-21 రబీ కాలంలో మిల్లర్లు డిఫాల్ట్ అయిన వారికి ప్రభుత్వం వేసిన 25 శాతం జరిమానాలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ అద్విత్ కుమార్ సింగ్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ డిఫాల్టర్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2021-21 రబీ కాలమునకు సంబంధించిన మిల్లులు డిఫాల్ట్ కావడం వలన, వారు కట్టాల్సిన 25శాతం పెనాల్టీకి సంబంధించి బ్యాంకు గ్యారంటీ కట్టమని ఆదేశించారు. జిల్లాలో వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత మిల్లాలకి సూచించారు. అకాల వర్షాల నుండి ధాన్యంను తడవకుండా జాగ్రత్త పడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 2023-24 సంబందించిన సిఎంఆర్ డెలివరీస్‌ను వేగవంతం చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డియం సివిల్ సప్లయ్ కృష్ణవేణి, సంబంధిత అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు : అంబటి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

రైతుల గూర్చి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, అమీనాపురం గ్రామాధ్యక్షులు సామ సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ముందు రైతులకు ఏదో అన్యాయం జరుగుతున్నట్లుగా ధర్నా చేయడం సిగ్గుచేటని, రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ లక్ష రూపాయలు చేస్తానని చేయకపోవడం, చాలాసార్లు వర్షాలతో రైతులు పంట నష్టం పోయినప్పుడు ఒక పైసా ఇవ్వని మీరు కేంద్రంలో బిజెపి రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చినప్పుడు దానికి మద్దతు పలికిన మీరా ఈరోజు రైతుల గురించి మాట్లాడేదని అన్నారు. మీరు నిరసన చేసినా చేయకపోయినా రైతు ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా నెరవేర్చి రైతుల వెన్నంటి ఉండి వారి కష్టసుఖాలలో పాలు పంచుకొని రైతుల యొక్క సమస్యలన్నిటిని తీర్చే బాధ్యత తీసుకుంటుందన్నారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, పోతుల రవి, లింగాల నేతాజీ, మందుల కృష్ణమూర్తి, వేల్పుగొండ ఏలియా, కొనకటి మహేందర్ రెడ్డి, లాకావత్ బాలు నాయక్, కొనకటి యాకయ్య, సింగిరెడ్డి సురేందర్ రెడ్డి, కొనకటి వెంకటరెడ్డి, కొనకటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-నెల్లికుదురు

మండలంలో మృతి చెందిన కుటుంబాలను డాక్టర్ భూక్య మురళి నాయక్ శుక్రవారం పరామర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు సాలుగు పూర్ణచందర్, ధూపటి సమ్మయ్య కుటుంబాల సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు మృతి చెందడం ఎంతో బాధాకరమని అన్నారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ హెచ్.వెంకటేశ్వర్లు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని సత్యపాల్ రెడ్డి, నాయకులు కుమ్మరికుంట్ల పులి శ్రీను, వారిపల్లి పూర్ణచందర్, వారిపల్లి ఉప్పలయ్య, వెన్నం క్రాంతి రెడ్డి, శ్రీశైలం యాదవ్, గోగుల మల్లయ్య, నెలకుర్తి వెంకటరెడ్డితో పాటు జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 5
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
శనివారం మే 18, 2024 www.navatelangana.com

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలి

అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-మల్హర్‌రావు

10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను మండల కేంద్రమైన తాడిచెర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కళాశాల భూపాలపల్లి నోడల్ అధికారి దేవరాజు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు అధ్యాపకులు నరేందర్, వెంకట్ రెడ్డి, రవి, భరత్‌రెడ్డి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడారు తాడిచెర్ల కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, గ్రంథాలయం, ల్యాబ్ తదితర సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. కళాశాల ప్రారంభం నుంచి మెరుగైన ఫలితాలు వస్తున్నట్లు వివరించారు.

ఏకరూప దుస్తుల తయారీని అదనపు కలెక్టర్ పరిశీలన



నవతెలంగాణ - ములుగు

వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి శ్రీజ, డీఆర్డీఏ శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. శుక్రవారం ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాల్లోని మండల సమాఖ్య మహిళలు కుడుతున్న ఏక రూప దుస్తుల తయారీని పరిశీలించారు. యూనిఫాంలు కుట్టేందుకు క్లాత్ మహిళ సంఘాల సభ్యులకు అందించామని తెలిపారు. విద్యార్థుల యూనిఫాం కుట్టుపనులను జూన్ 5లోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా పాఠశాలల, విద్యార్థుల వివరాల పూర్తి నివేదికను సమర్పించాలని ఎంపీడీఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఏ బాలస్వామి, ఏపీఎం నాగేశ్వర్‌రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి

పెండింగ్ అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హల్ నుండి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి, గ్రామాలలో తాగునీటి సమస్య అంశాలపై అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు పంచాయతీ సెక్రటరీలు, పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఏంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 12న పాఠశాలలు పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జూన్ మొదటి వారం లోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయిలో పనులు జరిగిన తరువాత మాత్రమే కాంట్రాక్టర్‌కు డబ్బులు అందించాలని అన్నారు. మహిళా సమైఖ్య నాయకులతో డబ్బు విడుదల గురించి తీర్మానం చేసి కాంట్రాక్టర్‌కు చెక్కు రూపంలో అందించి కాంట్రాక్టర్ సంతకాలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో జరిగే పనులకు ఇసుకను సమకూర్చడానికి సంబంధిత పంచాయితీ రాజ్ అధికారులతో అంచనాలు తీసుకుని కలెక్టర్ కు నివేదిక పంపితే ఉచితంగా అందిస్తామన్నారు. ప్రతి మండలం పరిధిలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వాటిని మోడల్ పాఠశాలల మాదిరిగా చేయాలన్నారు. గ్రామాల్లో తాగునిటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీరు అందక పోతే, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీరు అందించాలని ఆదేశించారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక) సంస్థలు పి శ్రీజ



నవతెలంగాణ - ములుగు

జిల్లాలోని అన్ని అమ్మ ఆదర్శ పాఠశాలలలో అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి శ్రీజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్‌డీఏ శ్రీనివాస్ కుమార్ తో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పనుల పురోగతిపై సమీక్ష స మావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలోని గుర్తించబడిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం,విద్యుత్, సుందరీకరణ పనులు చేపట్టిందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదని గుర్తించబడిన అభివద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, మండలాల ప్రత్యేక అధికారులు, ఏపీఎంలు, ఏఈలు, ఎంఈఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి : డీఆర్డీఓ పీడీ

నవతెలంగాణ-గణపురం

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ డీఆర్‌డీఓ పీడీ నరేష్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎల్ భాస్కర్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో పురోగతి పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న పాఠశాలలు పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జూన్ మొదటి వారం లోగా అన్ని పనులు పూర్తి చేయాలని కోరారు

జాతీయం రహదారిపై నిలిపిన ఇసుక లారీలకు జరిమానా..

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన ఇసుక లారీల నుంచి స్థానిక ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ జరిమానా విధించారు. శుక్రవారం ఏటూరునాగారం నుంచి ముళ్లకట్ట వరకు తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో 66 ఇసుక లారీలు రోడ్డుపై నిలిపివేశారు. దీంతో వారి నుంచి రూ. 75485ల జరిమానాలను విధించారు. అదేవిధంగా డ్రంకెన్ డ్రైవ్ కూడా చేపట్టారు. రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా లారీలను నిలిపినా... మద్యం సేవించి వాహనాలు నడిపినా.... కఠిన చర్యలు తప్పవన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. డ్రైవర్లు ఆర్‌టీఏ నిబంధనలు పాటించాలన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుల్స్ సదానందం, గోపి, శ్రీనివాస్, అజయ్, లక్ష్మణ్ నాయక్ ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు : డీఎంహెచ్‌ఓ మధుసూదన్‌రావు

నవతెలంగాణ-గణపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్‌రావు అన్నారు. శుక్రవారం 'మందులన్నీ నేలపాలు' అనే శీర్షికన నవ తెలంగాణ పత్రిక స్టేట్ పేజీలో వార్త ప్రచురితమైంది. అదే రోజు స్పందించిన డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్‌రావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా సిబ్బంది వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సహించేది లేదన్నారు. డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధులపట్ల నిర్లక్ష్యం చేస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. వచ్చిన రోగుల పట్ల మర్యాదగా మాట్లాడాలని, రోగులతో స్నేహభావంతో మెదలాలన్నారు మందులను, వాడిన బ్యాండేజ్ క్లాత్‌లను ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో వేయొద్దని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెట్లు చెదారం లేకుండా చూసుకోవాలని పలు సూచనలిచ్చారు.

నవతెలంగాణ ఎఫెక్ట్



వరి రైతు కంట కన్నీరు...



- ధాన్యం తూకానికి నిరీక్షణ...
- జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాలు
- అకాల వర్షాలతో కల్లాలో తడిచిన వడ్లు
- అనేక ప్రాంతాలలో నిలిచిన కొనుగోళ్లు
- కోత దశలోనే భారీ వర్షాలు
- నేల వాలిన వరి పంటలకు మొలకలు
- జిల్లాలో2,860 ఎకరాల్లో పంట నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



నవతెలంగాణ-భూపాలపల్లి

వరి రైతు కంట కన్నీరు వస్తోంది. ధాన్యం తూకానికి రైతులు నిరీక్షిస్తున్నారు. మే నెలలో ప్రకతి కన్నెర చేసింది. ఉరుములు మెరుపులతో భారీ వర్షాలతో జిల్లాలో పలు మండలాలలోని గ్రామాలలో ఆరు గాలం కష్టపడే రైతన్నకు ఈ ఏడాది అంతగా కలిసి రాలేదు. ఎప్పటిలాగే అకాల వర్షాలు పంటలను ముంచెత్తాయి. ఇలాంటి రోజు జీవితంలో మళ్లీ ఎప్పుడు రావద్దని బాధితులు వేడుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆకాల వర్షాలు రైతులను కోలుకోలేదని దెబ్బతీస్తున్నాయి. జోరు వానకి పలు చోట్ల కల్లాలు, మార్కెట్ల వద్దకి తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొద్దిరోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, యాసంగి సీజన్ పంట చేతికొచ్చే సమయానికి ఈదురుగాలులతో చెడగొట్టు వానలతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 189 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. లక్షా21వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా గురువారం నాటికి కేవలం 17వేల320 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. పంటలు ఆలస్యం కావడం కారణమైతే, కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం మరో కారణమైందని రైతులు ఆరోపిస్తున్నారు. అకాల వర్షంతో జిల్లాలో 2,860 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. మరో 15 రోజులైతే జిల్లాలో వరి కోతలు పూర్తయ్యేవి ఈ సమయం లోనే భారీ వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. మొదటి వర్షానికే వరి పంటలు పూర్తిగా నేలవాలయి. దీంతో పడి పోయిన పంటకు మొలకలు వస్తుండడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. కోతలు పూర్తిచేసి ఆర పోసిన ధాన్యానికి జిల్లాలోని పాటు వివిధ గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమైనప్పటికీ మరో వారం రోజుల్లో ఊపందుకొనుండగా భారీ వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని చేకూర్చుతోంది. కనీసం పెట్టుబడి కూడా రాదు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వస్తుందనుకున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది.

జిల్లాలో కుండపోత వర్షం...

భూపాలపల్లి జిల్లా కాటారం, మల్హర్రావు, మహాదేవపూర్, మహాముత్తారం, పలిమెల, గణపురం రేగొండ చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి మండలాల్లో శుక్రవారం మళ్లీ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గురువారం అకాల వర్షానికి ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవగా కుప్పలను ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇంతలోనే మళ్లీ వర్షం మొదలు కావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షాలతో వరి రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఈనెల 15, 16, 17 భారీ వర్షం కురవడంతో వరి కోతలు మరో 5 రోజులు ఆలస్యం కావడం తిరిగి మళ్లీ శుక్రవారం మరోసారి భారీ వర్షం పడటంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.

పరిహారం అందించాలి



5 ఎకరాలలో వరి పంట సాగు చేశాను. 75 వేల రూపాయల వరకు పెట్టుబడి అయింది. మరో ఐదు రోజులలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చేది అకాల వర్షంతో వరి మొత్తం నీటిమట్టమయింది. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి పరిహారం అందించాలి.

-గౌర్రె ఏల్లేశ్వర్, రైతు

నష్టపరిహారం చెల్లించాలి



8 ఎకరాల్లో వరి పంట వేశాను. సుమారు లక్ష ఇరవై వేల వరకు పెట్టుబడి అయింది. దీంతో అప్పుల పాలయ్యాను.చెడగొట్టు వానతో పొలం నీట మునిగింది. కావున ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నష్టపరిహారం చెల్లించాలి.

- వంగ కుమారస్వామి, రైతు

కల్లాల్లో క'న్నీళ్ళు'... రైతులకు తప్పని తిప్పలు

- ముందుకు సాగని కొనుగోళ్లు
- వెంటాడుతున్న అకాల వర్షాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అరిగోస పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దవడంతో బోరుమంటున్నారు. ఎప్పుడు కొనుగోలు చేస్తారోని ఆశగా ఎదురు చూస్తున్నారు. చేతికందిన పంట కళ్ళముందే నేలపాలు కావడంతో గుండెలు బాదేలా విలసిస్తున్నారు. ధాన్యం తడిసి ముద్దవడంతో పంటల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని, పెట్టుబడులైనా వస్తాయో.. రావోనని కలత చెందుతున్నారు. శుక్రవారం మండలంలో తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల, కొండంపేట, రుద్రారం, కొయ్యూర్, వళ్లెంకుంట గ్రామాల్లో కురిసిన వర్షంతో కల్యాల్లో విక్రయించడానికి పోసిన ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి.

మల్హర్‌రావు మండలంలో యాసంగిలో 13,560 ఎకరాల్లో వరి సాగు చేశారు.ఇందుకు 10,460 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 11, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సన్న రకం తో పాటు దొడ్డు రకం ధాన్యం 200 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికే ప్రయివేటు వ్యాపారులు సేకరించినట్లు సమాచారం. ఇక మిగిలింది 10,260 టన్నులు మాత్రమే.ఇందులో ఇప్పటివరకు 1,500 మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలుస్తోంది. మరో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తోందని చెబుతున్నారు. మండలంలో రైస్ మిల్లులు లేకపోవడంతో మంథని,పెద్దపల్లి పట్టణాలకు తరలిస్తున్నారు.







గణపురం :

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో మండల రైతన్నలు అతలాకుతలమవుతున్నారు. భారీ వర్షం మూలంగా ధాన్యం గింజలు నేల రాలి మొలకలు వచ్చాయి. వరి పంటలు పూర్తిగా నేలవాలాయి. గణపురం మండలం లోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఆరబోయగా ధాన్యం పూర్తిగా కొట్టుకుపోయి నీటిలో తేలియాడింది. మోరంచ వాగు వెంట వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే మండలంలో వరి కోతలు ప్రారంభమైనప్పటికీ మరో వారం రోజుల్లో ఊపందుకోనుండగా వర్షాలు రైతుల్ని నిండా ముంచాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరపోసిన ధాన్యం మొలకెత్తాయి. కాగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మ్యాచర్ రావాలని చెప్పడం, మిల్లర్లు కూడా ధాన్యం తీసుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు.

రైతులను ఆదుకోవాలి



ఇటీవల వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దాయిన,రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం ప్రభుత్వం నాణ్యమైన ధరకు కొనుగోలు చేస్తూ, కోతకు ఉన్న పొలాలు నెలకొరిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.అకాల వర్షాలతో రైతులకు తీరని నష్టం జరిగింది కావున ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్ చెల్లించాలి.

- అక్కల బాపుయాదవ్, రైతు సంఘం నాయకుడు



గాలి వీచినా....చినుకు రాలినా.. !

- లూజ్ వైర్లతో అంధకారంగా మారుతున్న పల్లెలు
- గాలివానకు నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా

నవతెలంగాణ-మల్హర్‌రావు

చినుకు రాలినా.. గాలి వీచినా.. మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామాలు అంధకారంగా మారుతు న్నాయి. చిన్నపాటి గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపో వడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటలపాటు ఉచిత విద్యుత్ అందిస్తుంటే మండలంలో మాత్రం క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఎండాకాలంలో సాయంత్రం, రాత్రి సమయాల్లో గాలి వీయడంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారు.



తీవ్ర ఉష్ణోగ్రతతో వినియోగదారులు జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం వచ్చిన ఎలాంటి మార్పు ఉండదని మండల ప్రజలు వాపోతున్నారు.

మండలంలో 33/11కేవీ సబ్ స్టేషన్లు తాడిచెర్ల, మల్లారం, రుద్రారం, నాచారం, పెద్దతూండ్ల,వళ్లెంకుంట తదితర గ్రామాల్లో మొత్తం 6కేంద్రాలు,1159 ట్రాన్స్ పార్మర్స్ పని చేస్తున్నా ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని సబ్ స్టేషన్ పరిధి వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి వాన తగ్గిన సబ్ స్టేషన్లలో పని చేస్తున్న ఆపరేటర్లు సకాలంలో సరఫరాను పునరుద్ధరణ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. సబ్ స్టేషన్ల నుంచి గ్రామాలకు విద్యుత్‌ను అందించే కరెంట్ స్తంభాలు, తీగలు చాలా ఏళ్ల కిందట వేయడం, విద్యుత్ స్తంభాల కింద చెట్లు, హరిత హారం మొక్కలు చెట్లుగా మారి తీగలకు తగలడంతో కరెంట్ ట్రిప్పు వుంటుంది. ఇది ట్రాన్స్ కో అధికారులకు కూడా ఇబ్బందిగా మారింది.



తీగలను సరిచేయాలి : అక్కల బాపు యాదవ్ యువైఏఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు

లూజు వైర్లతోనే విద్యుత్ సమస్య ఎదురవుతోంది.ట్రాన్స్ కో అధికారులు ముందు విద్యుత్ తీగలను సరి చేయాలి.సబ్ స్టేషన్లకు ఫోన్ చేస్తే సిబ్బంది స్పందించడం లేదు.రాత్రి సమయంలో అంతరాయం ఏర్పడితే నిద్రకు దూరం కావాల్సి వస్తోంది.అధికారులు ఇకనైనా స్పందించి కరెంట్ సమస్య లేకుండా చూడాలి.

ఓ వైపు ఎండ... మరో వైపు వాన...

- వాతావరణంలో పెనుమార్పులు

మరో ఐదు రోజులు వర్షాలు

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం నుంచి వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఒకవైపు భగభగ మండే ఎండలు, మరోవైపు వానలు పడుతూన్నాయి. దీంతో విరుద్ధమైన వాతావరణం నెలకొంటోంది. గురువారం రాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో ఐదు రోజులపాటు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. అదే సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వివిధ మండలాలలో 36 నుంచి 40-డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలూ ఉన్నాయని వెల్లడించింది. ఈ నెల 17,18,19, 20, 21 తేదీల్లో పలు మండలాలలో వడగండ్ల వాన, భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారం కురిసిన వర్షానికి గణపురం మండలంలో 47.2మి.మీ, రేగొండ మండలంలో 39.8మి.మీ అత్యధికంగా వర్షపాతం నమోదయింది.

జిల్లాలో నమోదైన వర్షపాతం... మిల్లీమీటర్లలో



మహదేవపూర్	20.6
పలిమెల	8.2
మహ ముత్తారం	12.4
కాటారం	19.4
మలహర్రావు	14.2
చిట్యాల	14.2
టేకుమట్ల	13.4
మొగుళ్లపల్లి	13.2
రేగొండ	39.8
గణపురం	47.2
భూపాలపల్లి	23.6

నవతెలంగాణ 6

జయశంకర్ ములుగు - భూపాలపల్లి

శనివారం మే 18, 2024 www.navatelangana.com

నష్టపోయిన రైతులకు బీజేపీ పరామర్శ

నవతెలంగాణ-మహాదేవపూర్

మండలంలోని గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరి కల్లాల్లో ధాన్యం తడిసిపోయింది. బీజేపీ నాయకులు శుక్రవారం వర్షానికి వడ్లు తడిసి నష్ట పోయిన రైతుల ధాన్యంను పరిశాలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎటువంటి కటింగ్ లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రూ.500 రూపాయల బోనస్ చెల్లించాలని, వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి మంథని రాజేందర్, యూత్ ప్రెసిడెంట్ రాంశెట్టి మనోజ్,బీజేపీ నాయకులు, కన్నెబోయిన అయిలయ్య యాదవ్ ,అడప లచ్చన్న,మాజీ ఎంపీటీసీ సాగర్ల రవీందర్, ప్రశాంత్,చింటూ,కృష్ణ,కొక్కు రాకేష్,అన్వేష్, అజయ్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడుదాం

: చల్ల లింగయ్య పటేల్

నవతెలంగాణ - ములుగు

మారోజు వీరన్న కలలుకన్న సామాజిక న్యాయం కోసం పోరా డుదామని సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్ల లింగయ్య పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మారోజు వీరన్న వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య పటేల్ మాట్లాడుతూ దళిత బహుజనులకు రాజ్యాధి కారం రావాలంటే, అణిగారిన కులాలను చైతన్యం చేసినప్పుడే సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోరే రవి యాదవ్, ముస్లిం న్యాయ వేదిక జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫతుల్ల, లంబాడీ న్యాయ వేదిక అధ్యక్షులు దేవానాయక్, ముదిరాజ్ మహా సభ నాయకులు రమేష్, ఒడ్డాల బుచ్చయ్య యాదవ్, సతీష్ మంజు నాయక్ తది తరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు

తగిన ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భూపాలపల్లి

జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లి మెంటరీ పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో విద్యా, రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, సమాచార, మున్సిపల్, విద్యుత్, వైద్య, రవాణా, పోస్టల్, ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మే 24వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఉదయం 9 గంటల నుండి మధ్యహం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30గంటల నుండి సాయంత్రం 5.30వరకు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 5 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, మొదటి సంవత్సరం విద్యార్థులు 1015 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 426మంది మొత్తం 1441మంది సప్లమెంటరీ పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. జూన్ 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకునేందుకు రూట్లు వారిగా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రవాణా సౌకర్యాలు సరిగా లేని పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సరైన సమయంలో చేరుకునే విధంగా బస్సులు నడపాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్ ప్యాకేట్స్, అత్యవసర మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష నిర్వహణ అనంతరం పరీక్ష ప్రశ్న పత్రాలను పోలీసు బందోబస్తు తో తరలించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని చెప్పారు. పరీక్ష ప్రశ్నపత్రాలను భద్రపరచుటకు పోలిస్ స్టేషన్ల లో తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రశ్నపత్రాలను పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకువెళ్ళేటప్పుడు, తిరిగి వచ్చే టప్పుడు పటిష్ట పోలీసు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో మాస్ కాపీయింగ్, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దేవరాజం, జిల్లా విద్యా శాఖ అధికారి రాంకుమార్, డీపీఓ నారాయణరావు, డీఎం హెచ్ఓ మధుసూదన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన నాగేంద్రబాబు

నవతెలంగాణ-మంగపేట

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు కలిసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లా అభివృద్ధిలో వెనుక బడి ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి సీతక్క చిన్న చిన్న గ్రామాల్లో కూడా సిసి రోడ్ల నిర్మాణం వంటి పనులకు నిధులను మంజూరు చేసిందని అన్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని వెల్లడించాడు. మండల ప్రజలకు ప్రధాన సమస్యగా మారి అపరిష్కృతంగా ఉన్న నరసింహ సాగర్ ప్రాజెక్టు గోదావరి పరివాహక ప్రాంతంలో కరకట్ట నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి వరద ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏఈ సాయి కృష్ణ

నవతెలంగాణ- ములుగు

మండలంలోని ములుగు,పతిపల్లి, కాశిందేవి పేట సబ్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్, సబ్ స్టేషన్ లో మరమ్మతు పనులు జరుగనున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందని, ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఆ సబ్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మరమ్మతుల కారణంగా...

నవతెలంగాణ- తాడ్వాయి

మండల పరిదిలో గల 33కే.వి. కాటపూర్ ఫీడర్, కాటపుర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా నేడు (శనివారం) ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 2 గంటల వరకు, విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ, ఎన్పీడీసీఎల్ ఏఈ వేణు కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మర మ్మతుల కారణంగా కాటపూర్, దామెరవాయి, పంబపూర్, గంగారాం, నర్సాపూర్, బీరెల్లీ, అంకంపల్లి, రంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోగల గ్రామాలకు అంతరాయం కల్గుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-భూపాలపల్లి

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులను 20 రోజుల్లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం డాక్టర్.బి ఆర్ అంబే ద్కర్ సచివాలయం నుంచి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, ధాన్యం కొనుగోళ్లు, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యుత్, తాగునీరు సరఫరా, రంగులు, మరుగుదొడ్లు వంటి పనులు పూర్తి చేపించాలని సూచించారు. పనులన్నీ నాణ్యతతో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫామ్ మెజర్మెంట్లు, స్టిచ్చింగ్ తొందరగా పూర్తి చేయించి అందించాలని సూచించారు. టెక్స్ట్ బుక్స్ పాఠశాలల ప్రారంభానికి ముందే 100శాతం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ ప్రజావాణి, ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ పూర్తి అయిన తర్వాత యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి వెంటనే మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 117 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 16,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకనూ దాదాపు 45 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 13 మిల్లులు ఓపీఎంఎస్ ద్వారా కేటాయించామని మిలర్లతో ఏలాంటి సమస్య లేదని అన్నారు. ఏజెన్సీతో చర్చించి తొందరలోనే పూర్తిస్థాయిలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని తెలిపార అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఓ నారాయణ రావు, పౌర సరఫరాల అధికారి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ములుగు : ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌళిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు రెగ్యులర్ గా తహసిల్దారులతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని శాంతి కుమారి అన్నారు. ప్రజావాణి దరఖాస్తులలో అధికంగా రెవెన్యూ ధరణి సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని, వీటిని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కనీస మౌళిక సదుపాయాలు, మరమ్మతుల పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. సకాలంలో బిల్లులు చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నామని తెలిపారు. ఆర్డీఓ సాత్యపాల్ రెడ్డి, డీఆర్డీ ఎ శ్రీనివాస్ కుమార్, సివిల్ సప్లై మేనేజర్ రాంపతి, డీఈఓ పాణిని, వ్యవసాయశాఖ అధికారి విజయ్ చంద్ర, ఎస్సి కార్పొరేషన్ ఈడీ తుల రవి పాల్గొన్నారు.

బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి

నవతెలంగాణ-గోవిందరావు పేట



వరుసగా కురుస్తున్న అకాల భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కోటగడ్డ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వరి పొలాలు మొత్తం పడిపోయి చేతికొచ్చిన పంట పూర్తిగా దెబ్బ తిన్నదని ప్రతిరోజు భారీగా కురుస్తున్న వర్షాలకు పంటలు చేతికొచ్చే అవకాశం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు 30000 రూపాయలు ఖర్చుపెట్టినట్టు తెలిపారు. కాగా కౌలు రైతులకు పెట్టుబడులు వచ్చే అవకాశం లేదని పేర్కొన్నారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించాలని ఎకరాకు రూ.20000 నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వర్షంతో తడిసిన ధాన్యం మొలకెత్తిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిల్లర్స్ ఇదే అవకాశం తీసుకొని రైతులు నష్టపరుస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తీగల ఆదిరెడ్డి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు, అఖిలపక్ష రైతు సంఘం మండల అధ్యక్షుడు గొల్లల నర్సిరెడ్డి, రైతులు కుంచాల తిరుపతిరెడ్డి, బైరి కొండల్‌రెడ్డి, వేములవాడ సాంబశివ రావు, ఆలేటి తిరుపతిరెడ్డి, తుమ్మల సుధాకర్‌రెడ్డి, ఏనుగ శేఖర్ రెడ్డి, మట్ట సోమిరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

డపింగ్ యార్డులను వినియోగంలోకి తేవాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి

గ్రామాల్లో పారిశుధ్యాన్ని పెంపొందించేందుకు గ్రామ పంచాయతీల్లో నిర్మించిన డంపింగ్ యార్డులునిరుపయోగంగా ఉన్నాయని వాటిని వాడుకలోకి తీసుకొచ్చి, ఇంటింటి నుండి సేకరించిన తడి, పొడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హల్ నుండి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతి, గ్రామాలలో త్రాగునీటి సమస్య అంశాలపై అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తాసిల్దార్లు,ఎంపీఓలు పంచాయితీ సెక్రటరీ లు, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఏంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటి నుండి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులలో వర్మీ కంపోస్టు తయారు చేసి వ్యర్థాలు నుండి ఆదాయం సమకూరే విధంగా చర్యలు చేపట్టాలని పంచాయతి రాజ్ అధికారులను ఆదేశించారు. ఆరుబయట వ్యర్థాలు వేయడం, చెత్తను కాల్చడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆయన సూచించారు. అరు బయట వ్యర్థాలు వేస్తే జరిమానా విధించాలని హెచ్చరించారు. స్మశాన వాటికలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేయాలని, స్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైకుంఠ దామాల్లో చెట్లు నాటాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ లో నాటిన మొక్కలను సంరక్షించాలని, సకాలంలో నీరందించాలని తెలిపారు. డంపింగ్ యార్డులు లేని గ్రామాలలో అంచనాలు తయారు చేసి నివేదిక అందించాలని అన్నారు. రాబోయే 4 నుండి 5 రోజులలో ప్రత్యేక టీం జిల్లాలో పర్యటనకు వస్తున్నారని తెలిపారు. వచ్చే శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాలలు, తాగు నీరు, డంపింగ్ యార్డు లాంటి అంశాలపై సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని పురోగతి కనిపించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి నారాయణ్ రావు, జిల్లా విద్యా శాఖ అధికారి రాంకుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎపివోలు, పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులుతదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లాకావత్ నరసింహ

నవతెలంగాణ-గోవిందరావు పేట



ఓట్లు సీట్లు అంటూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లాకవత్ నరసింహ అన్నారు. శుక్రవారం మండలంలో గత రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం రాశులను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఎంతసేపు రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రి మంత్రివర్గ సభ్యులు ప్రతిపక్షాలను దుమ్ము ఎత్తిపోయడమే తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. యాసంగి పంట ఇప్పటికి నాలుగు సార్లు వర్షం కురిసి తడిసి రైతులు ఇబ్బందులు పడుతుంటే ఏ ఒక్క మంత్రి కానీ, ఎమ్మెల్యే కానీ, అధికారి కానీ ఇప్పటివరకు రైతులను పట్టించుకునే నాధుడే కరువు ఆయ్యాడని అన్నారు. కొనుగోలు కేంద్రాల వారు మాకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు అందలేదని చెబుతూ తడిసిన ధాన్యాన్ని ఖరీదు చేయకుండా రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు. తేమ శాతం లోను తడిసి రంగు మారిన ధాన్యం, భూమిలో తేమ వల్ల కాస్తో కూస్తో మొలకెత్తిన ధాన్యం కొనుగోలు విషయంలో నిబంధనలను సడలించామంటునన ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోకపోవడం దుర దృష్టకరమని అన్నారు. ధాన్యం దిగుమతి కాకుండా మిల్లర్లు సతాయిస్తున్నారని రైతులు తెలుపుతున్నందున సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు కమిటీ అధ్యక్షులు సూరినేని రవీందర్ మాజీ సర్పంచ్ ధారావత్ రాకేష్ ఉపసర్పంచ్ అల్లం లేని హనుమంతరావు, రైతులు జాస్తి శ్రీనివాసరావు, యల్ రవి, బెల్లీ లింగయ్య, లక్ష్మణ్, కుశలరావు, వెంకటేష్, కృష్ణ , రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు.

19న రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు



అల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ నెంబర్ 542 ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన, మండలంలో ఐదు జిల్లా పరిషత్ పాఠశాలలు, కాస్తూర్బా ఆశ్రమ,మోడల్ పాఠశాలల్లో 10వ తరగతిలో టాపర్స్, మండల కేంద్రమైన తాడిచెర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ టాపర్‌గా నిలిసిన విద్యార్థులకు ఈనెల 19న ఆదివారం కొయ్యూర్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా సన్మానం ఉంటుందని అల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ కాళేశ్వరం జోనల్ యూత్ అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు బండి సుధాకర్,సొసైటీ సభ్యుడు శనిగల లక్ష్మన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొయ్యూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహనీయుల చరిత్ర పుస్తకాల పంపిణీ అల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ ఆదేశాల మేరకు సన్మానిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభా చూపిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సొసైటీ తరుపున ఆదివారం ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న మహనీ యుల అభిమానులు, ఉద్యోగులు, విద్యార్థులు,విద్య అభిమానులు , ప్రజా సం ఘాల, అంబేద్కర్ సంఘాల నాయకులు, సొసైటీలో అనుబంధ శాఖల సభ్యు లందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతిభ చాటిన విద్యార్థుల పేరు నమోదు కోసం 9542191155, 9391673460లో సంప్రదించాలన్నారు.



పాఠశాలలు ప్రారంభం రోజే....

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ

జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణి

నవతెలంగాణ - ములుగు



పాఠశాలలు ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... సర్కారు బడిలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటుకు ధీటుగా వసతులను కల్పించ డంతోపాటు నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశానుసారం పాఠశాల పునర్ ప్రారంభం రోజు విద్యార్థుల చేతుల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు అందేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలలో 31,796 మంది విద్యా ర్థులు చదువుతున్నారని అన్నారు. వీరికి ఉచిత పాఠ్యపుస్తకాలు 2,12,554 అవసరం ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపగా ఇందులో ద్విభాష పాఠ్యపుస్తకాలు(పార్ట్ 1), ఆంగ్ల మాధ్యమ పాఠ్య పుస్తకాలు ముందుగా సరఫరా చేస్తారని అన్నారు. ముందుగా సరఫరా చేయాల్సిన పుస్తకాలు 1,72,344 అవసరం కాగా ఇప్పటివరకు జిల్లాకు 66000 పుస్తకాలు చేరుకున్నాయన్నారు. కాగా 1,06,344 పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పాఠశాలల విద్యార్థులకు సరిపడా యూనిఫార్మ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ జూన్‌లో పాఠశాలలు పున ప్రారంభం రోజే పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసే ఉచిత ఏకరూప దుస్తులను ఈ నెలాఖరులోపు కుట్టించేలా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి పాణిని ఆదేశించారు.

పకడ్బందీగా ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



జిల్లాకు రావాల్సిన పాఠ్యపుస్తకాలు 1,72,344 ఇందులో 66000 పుస్తకాలు జిల్లాకు చేరాయి. వాటిని వెంట వెంటనే మండల కేంద్రాలకు పంపించాం. రాబోయే పుస్తకాలను కూడా వెనువెంటనే మండల కేంద్రాలకు పంపించి పాఠశాల పున ప్రారంభంలోగా పాఠ్య పుస్తకాలు పాఠశాలలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– పాఠ్యపుస్తకాల నోడల్ అధికారి అప్పని జయదేవ్

అధికారులకు సూచించాం....



జిల్లాలో 421 పాఠశాలల్లోని 19,645 మంది విద్యార్థులకు ఒక జతకు సరిపడా 40,605 మీటర్ల యూనిఫామ్ క్లాత్ వచ్చింది. బాల, బాలికలకు ప్రభుత్వం నిర్ణయించిన కొత్త డిజైన్ ప్రకారం సరిపడా సైజుల్లో కుట్టాలని సూచించాం. యూనిఫామ్ డీఆర్డీఏ సహకారంతో స్వయం సహాయక మహిళ గ్రూపుల ద్వారా కుట్టడం జరుగుతుంది. బడుల పునర్ ప్రారంభం నాటికి ముందే పాఠశాలలకు ఏక రూప దుస్తులు చేరుకునేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులకు, ఏపీఎం లకు సూచించాం.

– సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ సాంబయ్య